teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 367 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 11 మే 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## సీఎం రేవంత్ రెడ్డికి ఎన్నికల సంఘం షాక్

కేసీఆర్‌ను దూషించినందుకు రేవంత్ రెడ్డికి నోటీసులు జారీ

48 గంటల్లో వివరణ ఇవ్వాలంటూ షోకాజు నోటీసులు



తెలంగాణ బ్యూరో, మే 10 (తీన్మార్ న్యూస్ ): లోక్ సభ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్ రెడ్డికి ఎన్నికల సంఘం షాకిచ్చింది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషించినందుకు, అసభ్య పదజాలం వాడినందుకు రేవంత్ రెడ్డికి నోటీసులు జారీ చేసింది. 48 గంటల్లో వివరణ



## ఫాస్ట్ ఫుడ్స్‌తో జర జాగ్రత్త..



అనారోగ్యాలను కొనితెచ్చుకునే అవకాశాలే ఎక్కువ

ప్రాసెస్డ్ ఫుడ్స్ తో శరీరానికి పోషకాల కొరత


జబ్బులకు కారణంగా నిలుస్తున్న ఫాస్ట్ ఫుడ్స్






తెలంగాణ బ్యూరో, మే 10 (తీన్మార్ న్యూస్): ఇటీవల కాలంలో అందరు ఫాస్ట్ ఫుడ్స్ ఎక్కువగా తింటున్నారు. దీంతో అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. చిన్న వయసులోనే బీపీ, షుగర్ వంటి రోగాలకు దగ్గరవుతున్నారు. ఈనేపథ్యంలో ఫాస్ట్ ఫుడ్స్ వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయని తెలుసుకున్నా మానడం లేదు. చిప్స్, మ్యాగీ, ఇతర ఆహార పదార్థాలు మనిషి ఆరోగ్యాన్ని దెబ్బ తీస్తున్నాయి. ఇందులో వాడే ఉప్పు, చక్కెర, మైదా, కొవ్వు, నూనెలు ఆయుర్దాయాన్ని తగ్గిస్తాయి. వాటి వాడకం వల్ల మనిషి శరీరం శుష్కించిపోతుంది. వీటికి తోడు కూల్ డ్రింక్స్ కూడా ఎక్కువగా తాగుతున్నారు. ఇందులో పురుగుల మందు కలవడం వల్ల మన ఆరోగ్యానికి హానికరమే. ప్రాసెస్డ్ ఫుడ్స్ తినడం వల్ల శరీరానికి తగిన

మిగతా 2 లో



## 50 రోజుల తర్వాత కేజ్రీవాల్‌కు భారీ ఊరట

### మధ్యంతర బెయిల్ మంజూరు చేసిన దేశ సర్వోన్నత న్యాయస్థానం

న్యూ ఢిల్లీ, మే 10 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌కు 50 రోజుల తర్వాత భారీ ఊరట లభించింది. శుక్రవారం ఆయనకు దేశ సర్వోన్నత న్యాయస్థానం మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం కీలక తీర్పు వెలువరించారు. పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికల ప్రచారం నిర్వహించాల్సిన అవసరం ఉందని, న్యాయస్థానానికి కేజ్రీవాల్ విన్నవించుకున్నారు. మొత్తానికి కేజ్రీవాల్ అభ్యర్థనను మన్నించిన ధర్మాసనం జూన్ 1 వరకు బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉంటే ఢిల్లీలో ఆరు దశలో పోలింగ్ జరగనుంది. అనగా మే 25న ఓటింగ్ జరగనుంది. జైలు నుంచి విడుదల కాగానే ఆయన ఎన్నికల ప్రచారంలో పాల్గొనవచ్చని ఆప్ నేతలు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే ఆప్ శ్రేణులు సంబరాల్లో మునిగి

మిగతా 2 లో

## రాష్ట్రంలో ఓవైపు ఎండలు.. మరోవైపు వానలు

### తెలంగాణలో విచిత్రమైన వాతావరణం

#### రెండురోజులు వర్షాలు కురువనున్నట్లు వాతావరణ కేంద్రం వెల్లడి

తెలంగాణ రాష్ట్రంలో విచిత్రమైన వాతావరణం నెలకొంటోంది. ఓవైపు ఎండలు మండిస్తుంటే, మరోవైపు వానలు దంచికొడుతున్నాయి. మరో రెండురోజులు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, ఉరుములుతో వానలు పడతాయని తెలిపింది. తమిళనాడులో ఏర్పడిన ద్రోణి రెండు తెలుగు రాష్ట్రాలపై బలంగా విస్తరించినట్లు వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.



హైదరాబాద్, మే 10 (తీన్మార్ న్యూస్):యాదాద్రి, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, అసిఫాబాద్, మంచిర్యాల, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వికారాబాద్, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆసిఫాబాద్, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్, జనగాం జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడనున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేశారు. రాష్ట్రంలో నిన్నా మొన్నటి వరకు భానుడు ఉగ్రరూపం దాల్చడంతో మలమల

మిగతా 2 లో



## సార్వత్రిక ఎన్నికల వేళ ప్రత్యేక బస్సులు

### దాదాపు 2 వేల ప్రత్యేక బస్సులు ప్రత్యేక సర్వీసులు

హైదరాబాద్, మే 10 (తీన్మార్ న్యూస్): సార్వత్రిక ఎన్నికల వేళ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. దాదాపు 2 వేల ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెలిపింది. హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి 500, జేబీఎస్ నుంచి 200 ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఉప్పల్ నుంచి 300, ఎల్బీ నగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులు నడవనున్నాయి. కాగా, శుక్ర, శని, ఆదివారాల్లో నడిచే 450 బస్సుల్లో రిజర్వేషన్లు ఇప్పటికే పూర్తయ్యాయి. సొంత ప్రాంతంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు నగరవాసులు పల్లె బాట పడుతున్నారు. వరుస సెలవులు కలిసి రావడంతో హైదరాబాద్ లో ఉండే వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల వారు ఓటేసేందుకు ఎలక్షన్ జర్నీకి సిద్ధం అయ్యారు. మే 13న పోలింగ్ ఉండగా 11న రెండో శనివారం, 12న ఆదివారం సెలవు ఉండటంతో ముందుగానే సొంత

మిగతా 2 లో

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుపై అరెస్ట్ వారెంట్ జారీ

### ఇప్పటికే ప్రభాకర్‌పై లుక్ అవుట్ నోటీసులు జారీ



హైదరాబాద్, మే 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో విచారణ జరిపిన నాంపల్లి కోర్టు ఎస్‌బీఐ మాజీ చీఫ్ ప్రభాకర్ రావును అరెస్ట్ చేసేందుకు వారెంట్ జారీ చేసింది. సీఆర్పీసీ 73 సెక్షన్ కింద ప్రభాకర్ రావును అరెస్ట్ చేసేందుకు అనుమతివ్వాలంటూ పోలీసులు కోర్టును కోరారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు ప్రభాకర్ రావును అరెస్ట్ చేసేందుకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే

మిగతా 2 లో

## తెలంగాణ మోడల్ పాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్స్ ప్రారంభం

మొదటి సం. విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ప్రవేశాలు




2



## ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ మే 24కి వాయిదా

### హైపర్ టెన్షన్, గైనిక్ సమస్య అంటూ పిటిషన్లో పేర్కొన్న కవిత

తెలంగాణ బ్యూరో, మే 10 (తీన్మార్ న్యూస్): మద్యం పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణను మే 24వ తేదీకి ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది. కవిత బెయిల్ పిటిషన్‌పై వాదనలకు ఈడీ సమయం కోరడంతో కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. కవిత బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని

మిగతా 2 లో

## తెలంగాణ పాలిటిక్స్‌లో కేటీఆర్ నథింగ్

### టిష్యూ పేపర్‌తో సమానమంటూ రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు

### అతడిని సీరియస్‌గా ఎందుకు తీసుకుంటున్నారంటూ ఎద్దేవా

తెలంగాణ బ్యూరో, మే 10 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం ఓ ప్రైవేట్ టీవీ ఛానెల్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ కేటీఆర్ ఉడతలు పట్టేవాడని, అసలు అతడి గురించి ఎందుకు సీరియస్‌గా తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణ


మిగతా 2 లో



## తెలుగు రాష్ట్రాల్లో 48 గంటల పాటు మద్యం బంద్

### ఈ నెల 11 సాయంత్రం 6 గం.ల నుంచి 13 సాయంత్రం 6 గం.ల వరకు

తెలంగాణ బ్యూరో, మే 10 (తీన్మార్ న్యూస్): లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లో మద్యం షాపులు బంద్ కానున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 48 గంటల పాటు మద్యం విక్రయాలను నిలిపివేస్తున్నారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అంటే ఎన్నికలు ముగిసేంత వరకు రెండు రాష్ట్రాల్లోనూ మద్యం దుకాణాలను బంద్ చేయనున్నారు. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి.



# ఫాస్ట్ ఫుడ్స్‌తో జర జాగ్రత్త..






### మొదటి పేజీ తరువాయి

పోషకాలు అందవు. షుగర్, బీపీ, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి రోగాలకు కూడా ఈ ఆహారాలే కారణాలుగా నిలుస్తాయి. మనిషి ఆరోగ్యం తొందరగా పాడైపోవడానికి ఇవే కారణాలుగా ఉంటున్నాయి. ఈనేపథ్యంలో ఫాస్ట్ ఫుడ్స్ జోలికి వెళ్లడం అంత మంచిది కాదు. ఫాస్ట్ ఫుడ్స్ తినడం వల్ల శరీర భాగాలు తొందరగా పాడైపోతాయని తెలుస్తోంది. అందుకే వాటిని వాడకపోవడమే శ్రేయస్కరం. మన ఆయువు కాలాన్ని తగ్గించే ఫాస్ట్ ఫుడ్స్ ఎక్కువగా తినొద్దు. ఇటీవల కాలంలో ఇదే ఫ్యాషన్ గా మారిపోయింది. బేకరి ఫుడ్స్ లోనే వీటి మోతాదు అధికంగా ఉంటుంది. వాటిని తినడం వల్ల మన ఆరోగ్యం చెడిపోతుంది. మనం ఫాస్ట్ ఫుడ్స్ జోలికి వెళ్లకుండా జాగ్రత్త పడితేనే పది కాలాల పాటు మన ఆరోగ్యం మెరుగుగా ఉంటుందని తెలుసుకోవాలి.



## రాష్ట్రంలో ఓవైపు ఎండలు.. మరోవైపు వానలు




### మొదటి పేజీ తరువాయి

మాడిపోయిన ప్రజలు ఈ వర్షాలతో ఉపశమనం పొందారు. ఎండవేడికి, తీవ్ర వడగాడ్పులకు, ఉక్కపోతకు తట్టుకోలేక ముఖ్యమైన పనులున్నప్పటికీ వాయిదా వేసుకున్నారు. అత్యవసరమైతేనే బయటకు వచ్చేవారు. రెండు రోజులుగా వాతావరణం చల్లబడటం, రాష్ట్రవ్యాప్తంగా వానలు కురుస్తుండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. అకాల వర్షంతో రైతులకు భారీగా పంటనష్టం వాటిల్లింది. కల్లాల్లోని వరిధాన్యం తడిసి ముద్దవడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రస్తుతం ఉన్న రేటు ప్రకారమే కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఊరట పొందుతున్నారు. ప్రస్తుతం వాతావరణం కాస్తంత చల్లగా ఉన్నప్పటికీ రానున్న రోజుల్లో ఎండ వేడిమి తీవ్రంగా పెరిగే అవకాశం ఉందని, ప్రజలు ఉదయం 11.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటలకు ఇంట్లోనే ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## సార్వత్రిక ఎన్నికల వేళ ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ

### మొదటి పేజీ తరువాయి

ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా శుక్రవారం నుంచే ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఎప్పుడూ లేని విధంగా ఈ సారి ఎక్కువ సంఖ్యలో ఓటర్లు తరలివెళ్లే అవకాశం కనిపిస్తోంది. దీంతో పండుగల సీజన్ లాగే ప్రయాణికుల కోసం స్పెషల్ సర్వీసులు సిద్ధం చేసింది ఆర్టీసీ. అలాగే, దక్షిణ మధ్య రైల్వే కూడా ఎన్నికల పోలింగ్ సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. గతంతో పోల్చుకుంటే ఈసారి ముఖ్యంగా హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్ గిరి, రంగారెడ్డి, జిల్లాలో ఉండే వారు ఏపీలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళ్లే అవకాశం అధికంగా ఉంది. ఈ నేపథ్యంలోనే సాధారణంగా పండుగల సీజన్ లో నడిపే సర్వీసుల మాదిరిగా ఎలక్షన్ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలకు స్పెషల్ రైళ్లు, బస్సులను అందుబాటులోకి తీసుకువచ్చారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుపై అరెస్ట్ వారెంట్ జారీ

### మొదటి పేజీ తరువాయి

ఈ ఫోన్ ట్యాపింగ్ కేసులో సంబంధం ఉన్న నలుగురు పోలీసు అధికారులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన విషయం తెలిసిందే. పోలీసు కస్టడీలో ఉన్న ఆ నలుగురు వెల్లడించిన వివరాల ఆధారంగా ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును ప్రధాన సూత్రధారిగా వ్యవహరించినట్లు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ఈ కేసులో కీలక సూత్రధారి అయిన ఎస్బీఐ మాజీ చీఫ్ పై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తనపై కేసు నమోదైన వెంటనే ఆయన విదేశాలకు పారిపోయారు. ప్రభాకర్ రావు ఏ ఎయిర్ పోర్టులో దిగినా పట్టుకునేందుకు వీలుగా పోలీసులు ఇప్పటికే లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. ఆయన్ను పట్టుకునే క్రమంలో రెడ్ కార్నర్ నోటీసు, ఇంటర్ పోల్ అధికారులను దర్యాప్తు బృదం సంప్రదించాలంటే కోర్టు అనుమతి తప్పనిసరిగా ఉండాలి. ఈ నేపథ్యంలో సీఆర్పీసీ 73 సెక్షన్ ద్వారా పోలీసులు కోర్టు నుంచి అరెస్ట్ వారెంట్ తీసుకున్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి ఎన్నికల సంఘం షాక్

### మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలని రేవంత్ రెడ్డిని కోరింది. శుక్రవారం ఈ మేరకు షోకాజు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను వ్యక్తిగతంగా దూషించినందుకు, అసభ్యపదజాలం వాడినందుకు రేవంత్ రెడ్డికి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది.

**రేవంత్ రెడ్డికి ఈసీ నోటీసులు**

ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ కేసీఆర్ మతి ఉండి మాట్లాడుతుండో అంటూ కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి రెచ్చిపోయారు. రైతుబంధు సాయం, రైతురుణమఫీ విషయంలో కేసీఆర్, రేవంత్ మధ్య విమర్శలు జరిగాయి. అయితే ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నేతలు ఈసీకి ఫిర్యాదు చేశారు. దీంతో ఇవాళ సీఎంకు ఈసీ నోటీసులు ఇచ్చింది. మరి దీనిపై రేవంత్ రెడ్డి ఎలాంటి వివరణ ఇస్తారో చూడాలి.

## తెలంగాణ పాలిటిక్స్‌లో కేటీఆర్ నథింగ్

### మొదటి పేజీ తరువాయి

పాలిటిక్స్‌లో కేటీఆర్ అనే వాడు నథింగ్ అని టిష్యూ పేపర్‌తో సమానమని ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఇప్పటి వరకు అయితే తన ప్రత్యర్థి బీఆర్ఎస్, కేసీఆరేనని స్పష్టం చేశారు. ఆయన ఉన్నంత కాలం వీళ్లకు ఎవరికి అవకాశం ఇవ్వడని అనుకుంటున్నానని అన్నారు. ఫ్యూచర్‌లో బీఆర్ఎస్ పార్టీని కేటీఆర్, హరీష్ రావు ఎవరూ లీడ్ చేస్తారా అనేది వాళ్ల ఫ్యామిలీనే డిసైడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఇక, తెలంగాణ పవర్ కట్స్‌పైన సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. తెలంగాణ ఎలాంటి విద్యుత్ కోతలు లేవని స్పష్టం చేశారు. హరీష్ రావు లాంటి వాళ్లు కొంతమంది లైన్ మైన్లను మ్యానేజ్ చేసి కరెంట్ ఆఫ్ చేస్తున్నారని కీలక వ్యాఖ్యలు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన దాని కన్నా 40 శాతం ఎక్కువ విద్యుత్ సరఫరా చేస్తున్నామని తెలిపారు. విద్యుత్ కోతలపై రాష్ట్ర అసెంబ్లీలో చర్చపెడతామని, విద్యుత్‌పై హరీష్ రావు, జగదీష్ రెడ్డితో చర్చకు సిద్ధమని రేవంత్ సవాల్ విసిరారు.

## 50 రోజుల తర్వాత కేజ్రీవాల్‌కు భారీ ఊరట

### మొదటి పేజీ తరువాయి

తేలుతున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. అనంతరం రెండు సార్లు ఈడీ కస్టడీకి అనుమతించింది. అటు తర్వాత జ్యుడీషియల్ కస్టడీ విధించడంతో ఏప్రిల్ 1న తీహార్ జైలుకు తరలించారు. తాజాగా ఎన్నికల ప్రచారం కోసం సుప్రీంకోర్టు జూన్ 1 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. దాదాపు 21 రోజులు కేజ్రీవాల్‌కు బెయిల్ లభించింది. జూన్ 2న లొంగిపోవాలని కోర్టు తెలిపింది. కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు సందర్భంగా కోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సంజీవ్ ఖన్నా, దీపాంకర్ దత్తా మాట్లాడుతూ కేజ్రీవాల్ ఒక జాతీయ పార్టీకి నాయకుడని తెలిపారు. సమాజానికి ఎటువంటి ముప్పు కలిగించలేదని కోర్టు వ్యాఖ్యానించింది. అయినా కూడా ఇంకా దోషిగా నిర్ధారించబడలేదని అభిప్రాయపడ్డింది. ఎటువంటి నేర చరిత్రలు లేవు కాబట్టి సమాజానికి ముప్పులేదని పేర్కొంది. కేవలం లోకసభ ఎన్నికల ప్రచారం కోసమే బెయిల్ ఇస్తున్నట్లు తెలిపింది. అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన వద్దని సూచించింది. ఈ కేసుకు సంబంధించి గత నెలలో బెయిల్ పొందిన ఆప్ నాయకుడు సంజయ్ సింగ్‌కు విధించిన బెయిల్ షరతులు వర్తిస్తాయని స్పష్టం చేసింది. దేశ వ్యాప్తంగా ఏడు విడతల్లో పోలింగ్ జరుగుతోంది. ఇప్పటికే మూడు విడతల్లో ఏప్రిల్ 19, 26, మే 7న పోలింగ్ ముగిసింది. నాల్గో విడత మే 13న జరగనుంది. అనంతరం మే 20, 25, జూన్ 1న జరగనుంది. ఢిల్లీలో మాత్రం మే 25న ఓటింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు మాత్రం జూన్ 4న విడుదల కానున్నాయి

## ఎమ్మెల్సీ కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ మే 24కి వాయిదా

### మొదటి పేజీ తరువాయి

ఈడీకి కోర్టు నోటీసులు జారీ చేసింది. జస్టిస్ స్వర్ణకాంత శర్మ ధర్మాసనం విచారణ జరిపింది. తనకు బెయిల్ నిరాకరిస్తూ ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పుని హైకోర్టులో కవిత సవాల్ చేసింది. లిక్కర్ పాలసీ మనీలాండరింగ్ కేసులో తనకు వ్యతిరేకంగా ఆధారాలు లేకుండా అరెస్ట్ చేశారని,కేసు వాస్తవాలు పరిశీలించి తనకు అనుకూలంగా ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషన్‌లో కవిత పేర్కొంది. తనకు పలు అనారోగ్య సమస్యలు ఉన్నాయని పిటిషన్‌లో ఆమె ప్రస్తావించింది. హైపర్ టెన్షన్, గైనిక్ సమస్యలకు చికిత్స అవసరమని పిటిషన్ లో కవిత కోరారు. తాను జైల్లో ఉండడం వల్ల మైనర్ కుమారుడు షాక్ లో ఉన్నాడని పిటిషన్‌లో వెల్లడించారు. 1149 పేజీలతో కవిత న్యాయవాదులు హైకోర్టులో బెయిల్ అప్లికేషన్ వేశారు. త్వరితగతిన తన పిటిషన్ పై విచారణ జరపాలని కవిత తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో మార్చి 15న కవిత అరెస్టయ్యారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో భాగంగా తీహార్ జైలులో ఆమె తీహార్ జైలులో ఉన్న విషయం తెలిసిందే.

## తెలంగాణ మోడల్ పాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్స్ ప్రారంభం

హైదరాబాద్, మే 10 (తీన్మార్ న్యూస్): తెలంగాణ మోడల్ పాఠశాలల్లో ఇంటర్ అడ్మిషన్స్ 2024 కోసం నోటిఫికేషన్ ప్రకటించబడింది. అడ్మిషన్ 2024 %-% 25 విద్యా సంవత్సరకు జరుగుతుంది. ఈ ప్రవేశం మొదటి సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. మే 10 నుంచి దరఖాస్తులు ప్రారంభమైనవి. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేయాలి. మే 31 చివరి రోజు అని ప్రకటించారు. దరఖాస్తు షరతులు పదవ తరగతి ఉతీర్ణత సాధించిన విద్యార్థులకు వర్తిస్తాయి. ఇక ఈ నోటిఫికేషన్ సంబంధించి పూర్తి వివరాలు చూస్తే ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఇంగ్లీష్ మీడియం కోసం ప్రవేశాలు జరగనున్నాయి. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 194 ఆదర్శ పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీష్ మాధ్యమంలో ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్ లలో అడ్మిషన్లను అందిస్తారు. ఇక వీటికి అర్హత విషయానికి వస్తే పదో తరగతి అర్హత సాధించినవారు దరఖాస్తు చేసుకోవాలి.

## కేయు హిస్టరీ,టూరిజం డిపార్ట్మెంట్ అధిపతిగా డా.సిహెచ్ రాజ్ కుమార్

హన్మకొండ కేయు, మే 10 (తీన్మార్ న్యూస్): కాకతీయ యూనివర్సిటీ చరిత్ర మరియు టూరిజం డిపార్ట్మెంట్ అధిపతిగా డాక్టర్ చిలువేరు రాజ్ కుమార్ ను నియమిస్తూ కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సర్ ప్రొఫెసర్ తాటికొండ రమేష్ మరియు రిజిస్టర్ ప్రొఫెసర్ మల్లారెడ్డిలు అధికారిక ఉత్తర్వులను డాక్టర్ చిలువేరు రాజ్ కుమార్ కు అందజేయడం జరిగింది. ఈ మేరకు రాజ్ కుమార్ వారికి కృతజ్ఞతలు తెలియజేసశారు. ఈ సందర్భంగా కాకతీయ యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం నుంచి డాక్టర్ చిలువేరు రాజ్ కుమార్ కి అభినందనలు తెలియచేశారు.



## ఓ బర్ల కొట్టం వద్ద బర్లతో మాజీ మంత్రి మల్లారెడ్డి మాట మంతి

### నేను నీ మల్లన్నను.. నీకు సేవ చేసినా.. అంటూ నవ్వుల పువ్వులు

### రాజకీయ నేతలందు మల్లారెడ్డి వేరయా అన్నట్లుంది ఆయన శైలి

హైదరాబాద్, మే 10 (తీన్మార్ న్యూస్): మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి ఏం చేసినా సంచలనమే. తెలంగాణ రాజకీయాల్లోనే ఆయనొక స్పెషల్. రాజకీయ నేతలందు ఆయన వేరయా అన్నట్లు ఉంటుంది మల్లారెడ్డి శైలి. తాజాగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మల్లారెడ్డి నవ్వులు పూయించారు. తనదైన శైలిలో మజాక్ చేస్తూ అందరినీ ఆకర్షించారు. ఇంతకీ ఆయన ఏం చేశారో తెలుసుకుందాం మల్లారెడ్డి మైక్ ముందుకు వస్తే చాలు పాలమ్మిన.. పూలమ్మిన.. కష్టపడ్డ.. సక్సెస్ అయిన అంటూ యూనిక్ డైలాగ్స్ వదులతారు. తాజాగా ఆ డైలాగ్స్‌కు నిదర్శనమైన సీన్‌ను చూపించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్ధతుగా మాజీ మంత్రి మల్లారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ బర్ల కొట్టం వద్దకు వెళ్లారాయన. అక్కడ బర్రెల వద్దకు వెళ్లి వాటికి పచ్చి గడ్డి తినిపించే ప్రయత్నం చేశారు. ఆ.. ఆ.. ఆ.. జర తిను ఒక బుక్క అని మల్లారెడ్డి అన్నారు. మరోవైపు.. జనాలు ఎక్కువగా ఉండటంతో ఆ బర్రెలు భయంతో బెదురుతున్నాయి. దాంతో వారిని పక్కకు జరగాలని వారించారు మల్లారెడ్డి. ఆ తరువాత మరోసారి బర్రెలకు గడ్డి తినపెట్టే ప్రయత్నం చేశారు. నేను నీ మల్లన్నను.. చిన్నప్పుడు నీకు సేవ చేసినా.. అంటూ ఎన్నికల ప్రచారంలో నవ్వులు పూయించారు మాజీ మంత్రి మల్లారెడ్డి. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. మల్లారెడ్డితో అట్లుంటది మరి అని నెటిజన్లు కామెంట్స్ పెడుతున్నారు.



తీన్మార్
తెలుగు దినపత్రిక

## వెనుకబడిన వర్గాలు ఇక వెనకేనా?

భారత రాజ్యాంగంలో వెనుకబడిన వర్గాలను నిర్వచించకపోవడం వలన వెనుకబడిన వర్గాలు అనే పదానికి నిర్దిష్టమైన నిర్వచనం లభించడం లేదు. కనీసం రాజ్యాంగ రచయితలైనా లేదా సామాజికవేత్తలైనా వెనుకబాటుతనాన్ని నిర్వచించకపోవడం శోచనీయాంశం. 1956లో ప్రచురించిన వెనుకబడిన వర్గాల నివేదిక ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసి లను కలిపి వెనుకబడిన వర్గాలుగా పేర్కొన్నది. సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు నిర్వచించిన దాని ప్రకారం వెనుకబడిన వర్గం అంటే కులం, మతం, జాతి, భాష, వృత్తి తదితర ప్రాతిపదికలపై నిర్ధారించదగిన, గుర్తించదగిన వ్యక్తుల సమూహమై సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అంశాలలో వెనుకబాటు లక్షణాలతో ఉన్నదే వెనుకబడిన వర్గం. తక్కువ అక్షరాస్యత, విద్యలేమి, పేదరికం, శ్రామిక దోపిడీ, అంటరానితనం వంటి లక్షణాలతో కూడిన సాంఘిక సమూహాలు, వర్గాలు లేదా కులాలే వెనుకబడిన వర్గాలు. సాంఘికంగా, విద్యాపరంగా, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన వర్గాలైన కూలీలు, తెగలుకలిసి ఏర్పడిన సామాజిక వర్గమే వెనుకబడిన వర్గం. ఆర్టికల్ 15(4)- సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గం గురించి చెప్పింది. ఆర్టికల్ 16(4)- వెనుకబాటు వర్గం గురించి చెప్పి సేవా రంగాలలో వారికి సరైన ప్రాతినిధ్యం లేదని చెప్పింది. ఆర్టికల్ 45- ఉచిత నిర్బంధ విద్య గురించి చెప్పింది. ఆర్టికల్ 46- ఎస్‌సిలు, ఎస్‌టిలు అంతర్భాగంగా బలహీన వర్గాల అందరినీ కలుపుకొని వెనుకబడిన వర్గాలు అవుతారని చెప్పింది. ఆర్టికల్ 340- ప్రతి రాష్ట్రం ఆ రాష్ట్రంలో నివసిస్తున్న వెనుకబడిన వర్గాల స్థితిగతులను పరిశీలించి వారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని చెప్పింది. పైన పేర్కొన్న అభిప్రాయాలు, ఆర్టికల్స్ పరిశీలిస్తే ఎస్‌సిలు, ఎస్‌టిలు, బిసి లు కలిపి వెనుకబడిన వర్గాలుగా చెప్పవచ్చు. కానీ ఎస్‌సి, ఎస్‌టిల విషయానికి వచ్చేసరికి రాజ్యాంగం వారికి రాజ్యాంగ రక్షణ కల్పించింది. కానీ అదే బిసిల విషయానికి వస్తే రాజ్యాంగ రక్షణ లేదు, నిర్దిష్టమైన నిర్వచనం లేదు. భారత దేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న సమయంలోనే కొన్ని కులాలకు రిజర్వేషన్లు ఉండేవి. కాలక్రమేణా 1882- 91 ప్రాంతంలో కొల్హాపూర్ సంస్థానాధిషుడైన ఛత్రపతి సాహు మహారాజ్ సాంఘికంగా వెనుకబడిన జాతుల ప్రజలకు మొదటిసారి రిజర్వేషన్ సౌకర్యం కల్పించాడు. 1918లో మైసూరు రాజు కృష్ణరాజ వడియార్ నల్వాడి సాంఘికంగా అణగారిన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించాడు. కానీ దీనికి నిరసనగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య తన పదవికి రాజీనామా చేశాడు.ఆ తర్వాత 1921లో ప్రథమ జస్టిస్ పార్టీ ప్రభుత్వం మొదటి కమ్యూనల్ గవర్నమెంట్ ఆర్డర్ (జిఒ నెంబర్ 613)ని ఆమోదించి తద్వారా భారత దేశ శాసన చరిత్రలో రిజర్వేషన్లను చట్టబద్ధం చేసిన మొట్టమొదటి ఎన్నికైన ప్రభుత్వంగా చరిత్రలో నిలిచింది. ఈ విధానం అప్పటి నుండి దేశ వ్యాప్తంగా ప్రామాణికతను సంతరించుకుంది. ఆనాటి కేంద్ర ప్రభుత్వం ఆర్టికల్- 340 అనుసరించి తేదీ 30 జనవరి 1953లో కాకా కాలేల్కర్ ఆధ్వర్యంలో వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిశీలించేందుకు కమిషన్ వేసింది. ఇక్కడ వెనుకబడిన వర్గాలు అంటే ముఖ్యంగా బిసిల స్థితిగతులపై పరిశీలన. ఈ కమిషన్ 30 మార్చి 1955న వెనుకబాటుతనాన్ని నిర్ణయించేందుకు ప్రమాణాలు నిర్ణయిస్తూ నివేదిక సమర్పించింది. ఈ నివేదిక ప్రకారం హిందూ మతంలోని సాంప్రదాయక నిచ్చెన మెట్ల కులాల అమరికలో సాంఘికంగా అట్టడుగు స్థానం లో ఉండటం. ఒక కుల సముదాయంలో అంతర్భాగంగా లేదా ఆ కులంలో అభివృద్ధికి ఆమడ దూరంగా ఉండడం. ప్రభుత్వ సేవల్లో ప్రాతినిధ్యం లేకపోవడం. ఈ కొలమాన అంశాల పరంగా కాకా కాలేల్కర్ కమిషన్ 2399 సముదాయ సమూహాలను విద్యాపరంగా, సాంఘికంగా వెనుకబడినవిగా ప్రకటించింది. వీటిలో 913 సముదాయాల జనాభా 11.5 కోట్లుగా పేర్కొంది. ఎస్‌సి, ఎస్‌టిల జాబితాలు తరువాత తిరిగి ప్రకటించింది. అప్పటి దేశ జనాభా సుమారు 39,85,77,992. మిగిలిన 1486 సముదాయాల జనాభా పరిగణనలోకి తీసుకోబడలేదు.అంటే వారి జనాభా ఇంకెంత ఉంటుందో ఊహించుకోవచ్చు. నాటి నుండి నేటి వరకు బిసిల జనాభా 50 శాతానికి పైమాటే. కమిషన్ చేసిన కొన్ని సిఫారసులను పరిశీలించినట్లయితే 1961 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని వారి జనాభా లెక్కలు తయారు చేయాలి. కానీ ఇంతవరకు కులగణన చేయకపోవడం బిసిల దౌర్భాగ్యం. బిసిలపై పాలకులకు ఉన్న కుటిలనీతికి నిదర్శనం.సిక్కు, క్రిస్టియన్, ముస్లింలలోని కొన్ని సమూహాలను ఒబిసి వర్గాలుగా గుర్తించాలి. రాజ్యాంగపరంగా చట్టపరమైన రక్షణను కల్పించే పరిపాలన వ్యవస్థ మొత్తం కులతత్వంతో (ఆధిపత్య కులాలతో) నిండిపోయింది. కనుక ఈ పరిస్థితిని వెంటనే చక్కదిద్దకపోతే దేశంలో కులవర్గాలు చెలరేగి జాతీయ సమైక్యతకు పెను విఘాతం కలుగుతుందని చెప్పింది. ఒబిసి విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వాలి. వృత్తి విద్య కళాశాలలో 70% సీట్లు కేటాయించాలి. ప్రభుత్వ ఆధ్వర్యంలోని స్థానిక సర్వీసుల్లో క్లాస్-1 ఉద్యోగాల్లో 25%, రెండో తరగతి ఉద్యోగాల్లో 33.33%, మూడవ, నాలుగవ తరగతి ఉద్యోగాల్లో 40% ఒబిసిలకు కేటాయించాలి. వీటికి ఎస్‌సి, ఎస్‌టి రిజర్వేషన్లు చేర్చబడవు. అన్ని రిజర్వేషన్లు 49% దాట వద్దని కోరింది. గమనించాల్సిన విషయం ఏమిటంటే కాకా కాలేల్కర్ కమిషన్ నివేదికను కేంద్రం తోసిపుచ్చింది. ఈ నివేదికపై అప్పటి విద్యాధికా సంపన్న ఉన్నత సామాజిక వర్గాల వారు చాలా చాలా విమర్శలు చేశారు. సబ్బండ శ్రామిక వృత్తులు చేసే నిమ్నజాతి ప్రజలు మస్తు సమాజ ప్రగతి రథాన్ని నడిపిస్తున్నారు. ఈ ప్రజల బాగుకోసం రాజ్యాంగ రూపశిల్పులు సానుకూల వివక్ష (రిజర్వేషన్)ను పొందుపరిచారు. 70 సంవత్సరాల రిజర్వేషన్ చరిత్రలో అణగారిన ర్గాల బతుకులు పూరి గుడిసెల్ల పూటగడవని స్థితిలోనే కొనసాగుతున్నాయి. 2015 బీహార్ ఎన్నికల సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం చీఫ్ మోహన్ భగవత్ రిజర్వేషన్ విధానంపై సామాజిక సమీక్ష జరగాలని అన్నారు. దాని పరమార్థం ఏమిటో నేటికీ అంతుచిక్కడం లేదు. ఎందుకంటే ఈ మధ్యకాలంలో అంటే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు, అధికార పార్టీ వారు రిజర్వేషన్లు రద్దు చేస్తారు అని ఆరోపించడం జరిగింది. ప్రతిగా మోహన్ భగవత్ మళ్లీ రిజర్వేషన్ రద్దు అనేది జరగదు అని సెలవిచ్చారు.

# బీజేపీని ఓడిద్దాం - మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపుదాం

- మూడోసారి అధికారాన్ని దక్కించుకోవడనికి జిమ్మిక్కులు
- ప్రజా వ్యతిరేక మోడీ పాలనకు చరమగీతం పాడుదాం
- ఎంపీగా చల్లా వంశీచంద్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందాం
- బీజేపీ పాలనలో పెట్రోలు డీజిల్ నిత్యావసర సరుకులు విపరీతంమైన ధరలు
- రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా సర్వ నాశనం చేసిన కేసీఆర్
- పేదోడి ఇంటి నిర్మాణనికి పైసా వసూలు చేసిన మాజీ ఎమ్మెల్యే అల
- ప్రతి పనికి డబ్బులు డిమాండ్ చేసిన బిఆర్ఎస్ నాయకులు
- ప్రజా పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరికలు
- మండలానికి 350 ఇందిరమ్మ ఇండ్లు
- పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.6 లక్షలు
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి
- సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బర్



దేవరకద్ర ప్రతినిధి, మే 10(తీన్మార్ న్యూస్): ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు ఇదే చివరి అవకాశమని, మోదీ ప్రభుత్వాన్ని కలిసికట్టుగా గద్దె దించాలని, బీజేపీ గనక మళ్లీ గెలిస్తే రాజ్యాంగాన్నే మార్చేసి, ప్రజల హక్కులను కాలరాస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కోరారు. రాజ్యాంగం లేకపోతే రిజర్వేషన్లూ పోతాయని, పేదలు, రైతులు, శ్రామికుల సంపద అంతా దేశంలోని బడా వ్యక్తుల చేతుల్లోకి వెళుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని మండలం అధ్యక్షులు గజ్జల నాగన్న ఆధ్వర్యంలో వనపర్తి జిల్లా మదనాపురం మండల కేంద్రంలో మరియు దుప్పల్లి, కొత్తపల్లి,గోవింద హళ్లి,శంకరం పేట గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి చేతి గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రామస్తులను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి,తదితర మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. అనంతరం దుప్పల్లి, కొత్త పల్లి, గోవింద హళ్లి,శంకరం పేట, మదనపురం కు చెందిన బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, పలువురు వార్డ్ మెంబెర్స్ పలువురు బిఆర్ఎస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జియంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కోరారు. 2014లో అధికారంలోకి వచ్చిన మోదీ



నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వ రంగ సంస్థలను బడా వ్యాపార సంస్థలకు తక్కువ ధరలకు అమ్మేసి దేశాన్ని మరింత పేదరికంలోకి నెట్టిందని ఆరోపించారు. ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో 400 సీట్లు గెలిచి భారత రాజ్యాంగాన్ని మార్చి దేశాన్ని కాషాయీకరణ, కార్పోరేటీకరణ చేయాలని చూస్తోందన్నారు. నల్లధనం వెలికి తీస్తానన్న మోదీ నోట్ల రద్దుతో బడా నేతలు దాచుకున్న డబ్బును తెల్లధనంగా మార్చారని ఆరోపించారు. బీజేపీ పాలనలో దేశంలో పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు నిత్యావసర ధర లు విపరీతంగా పెంచి పేదల నడ్డీ విరిచారని విమర్శించారు. కేంద్రంలో తిరిగి బీజేపీ అధికారంలోకి వస్తే దళిత, గిరిజన, మైనా ర్టీలను ఊచకోత కోయడం ఖాయమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, యువత ఆలోచించి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకోవాలని అన్నారు. దేశ ప్రజానికాన్ని, కార్మికవర్గాన్ని బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని తెలిపారు. లోక్ సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ ప్రధాని అవుతారని అన్నారు.“ఒకవేళ తెలంగాణ రాష్ట్రం నుంచి కాంగ్రెస్ కు ఎక్కువ సీట్లను అందిస్తే, కేంద్రం నుంచి అధిక నిధులు మన రాష్ట్రానికి అందే అవకాశం ఉంటుంది. అభివృద్ధి వేగవంతం కాగలదు. కానీ బిజెపి,బిఆర్ఎస్ కలిసి కాంగ్రెస్ ను ఓడించే కుట్ర చేస్తున్నాయి. రాజ్యాంగం అనేది ప్రజల గొంతుక అని, ఒకవేళ రాజ్యాంగం ఖతమైతే దేశం వేర్వేరు రాజ్యాలుగా మరోసారి ముక్కలవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చామల కిరణ్ కుమార్ రెడ్డి కి మద్దతుగా ఇంటింటి ప్రచారం

- భువనగిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం
- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్

యాచారం, మే 10(తీన్మార్ న్యూస్): యాచారం మండలం, మల్కీజ్‌గూడ గ్రామంలో శుక్రవారం రోజు భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోసం ఇబ్రహీంపట్నం నియోజకవర్గము శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అదేశానుసారము గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చామల కిరణ్ కుమార్ రెడ్డి కి మద్దతుగా నిలబడి అతన్ని గెలిపించాలని గడప గడపకు తిరిగి వాల్ పోస్టర్లు అతికించి గ్రామములోని గ్రామీణ ఉపాధి హామీ కూలీలను కలసి ఈనెల 13 న జరిగే పార్లమెంట్ ఎన్నికలలో భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి కి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వరికుప్పల సుధాకర్ పాల్గొని మాట్లాడుతూ భువనగిరి కోటపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలల్లో పేదల పెన్నిధి మల్రెడ్డి రంగారెడ్డిని ఏవిధంగా అయితే భారీ మెజారిటీతో అందరము కష్టపడి గెలిపించుకున్నామో అదేవిధంగా మన భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి ని కూడా భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని సూచించారు. రాష్ట్రము లో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టినటువంటి 6 గ్యారంటీ సంక్షేమ పథకాలను అనగా మహిళకు ఉచిత ఆర్టీసీ బస్ ప్రయాణం, 500



లకే వంట గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు పేద ప్రజలకు ఉచిత కరెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ ధ్వారా 10 లక్షల ఉచిత కార్పొరేట్ ఉచిత వైద్యము, నిరుద్యోగులకు 30 వేల పారదర్శకమైన ఉదోగాల భర్తీలు, రైతు బంధు, వచ్చే 15 ఆగష్టు లోపు రైతులకు 2 లక్షల రుణ మాఫీ చేస్తారు అని ప్రజలకు చెబుతూ వాటివలన ప్రజలకు చేకూరే లబ్ధిని కూడా వివరించారు. బీజేపీ, బిఆర్ఎస్ మోసపూరిత పార్టీలని ప్రజలు నమ్మొద్దని సూచించారు. కేంద్రములో బీజేపీ మళ్లి అధికారం లోకి వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని, రిజర్వేషన్స్ రద్దు చేస్తారని తెలియచేశారు. అదేవిధంగా ఇదే తరహాలో జాతీయ కాంగ్రెస్ పార్టీ యువన్యాయం, నారి న్యాయం, రైతు న్యాయం, శ్రామిక న్యాయం, సామజిక న్యాయం పేరుతో పాంచ్ న్యాయ్ పేరుతో అందరికి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే ఎన్నికల హామీలను కూడా ప్రజలకు



వివరించి, అన్ని వర్గాల ప్రజలకు కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతున్నది మేలు జరుగుతుందని తెలిపారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి సారధ్యం లో ఎంపీ అభ్యర్థి ఛామల కిరణ్ కుమార్ రెడ్డి నిభారీ మెజారిటీతో గెలిపించాలని కోరడమైనది. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ మాజీ సర్పంచ్ తనయుడు చీర శేఖర్, గ్రామశాఖ అధ్యక్షుడు కొత్తపల్లి జంగారెడ్డి, ప్రధానకార్యదర్శి వరికుప్పల అజయ్, నాయకులు యాదయ్య, ఎల్లయ్య, మహేష్, విక్రమ్, వంశీ, మిట్టు,సాయి, కోటి, అజయ్ తదితర గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

# కుర్రారం లో జోరుగా కాంగ్రెస్ పార్టీ ప్రచారం

రాజాపేట, మే 10(తీన్మార్ న్యూస్): మండలంలోని కుర్రారం గ్రామంలో శుక్రవారం భువనగిరి పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు కోరుతూ గ్రామ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీలు, వ్యవసాయ హమాలి లను ఓటును అభ్యర్థించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో గతంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పుడు ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పనుల గురించి, ఇందిర ఇండ్లు, ఆరోగ్యశ్రీ పథకాలు గురించి వివరిస్తూ ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీసంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ, మళ్లీ దేశంలో ఇందిరమ్మ రాజ్యం రావాలని కోరుతూ చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం వారికి మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అదేవిధంగా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వ్యవసాయ హమాలీలను ఓటు అభ్యర్థిస్తూ వారు ఎండలో పనిచేస్తున్న పనితీరును గమనించి తల రుమాళ్లను వారికి అందించారు. ఈ విషయం పై ఉపాధి హామీ, వ్యవసాయ హమాలీలు కాంగ్రెస్ పార్టీ నాయకులకు అభినందనలు తెలుపుతూ మళ్లీ ఇందిరమ్మ రాజ్యం వస్తేనే దేశం బాగుపడుతుందని పేద ప్రజలు అభివృద్ధి చెందుతారని తెలుపుతూ ఇందిరమ్మ రాజ్యం కోసం పార్లమెంటు ఎన్నికలలో చామల కిరణ్ కుమార్ రెడ్డి చేతి గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతోని గెలిపిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ సభ్యులు పాండవుల బసవరాజ్ గౌడ్, బూత్కూరి నరసింహారెడ్డి, మాజీ సర్పంచులు, బూరుగు రమేష్ గౌడ్, పాండవుల లక్ష్మణ్ గౌడ్, బాల్ద చంద్రయ్య, రావుల చంద్రయ్య, భూపతి యాదగిరి, బూరుగు శీను, పెంటపర్తి సంతోష్ రెడ్డి, రావుల బాలయ్య, రావుల







బీరయ్య, నంద బాల నరసింహులు, ఎర్రగుంట యాదగిరి, శ్రీరాముల హుస్సేన్, ఊట్కూరి వేణు, మాచర్ల వెంకటేష్, కల్పగిరి బాలరాజ్, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మంచి సేవ గుణం ఉదార స్వభావం కలిగిన నేత విజెఆర్



ఆత్మకూర్, మే 10(తీన్మార్ న్యూస్): మంచి సేవ గుణం ఉదార స్వభావం కలిగిన నేత దానం గుణం కలిగిన ఆపదలో ఆదుకునే ఆపద్బాంధవుడు విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి వనపర్తి జిల్లా, ఆత్మకూర్ పట్టణ కేంద్రంలో విజెఆర్ ఫౌండేషన్ వాలంటరీస్కు తన సొంత ఖర్చులతో యువతకు ఉపాధి కల్పించాలని ఉద్దేశంతో నూతన బట్టల దుకాణాన్ని ఏర్పాటు చేసుకునేందుకు పెట్టుబడి సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం రోజు విజెఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథరెడ్డి షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా వాలెంటరీస్ అనిల్ స్వరాజ్ ఆధ్వర్యంలో విజెఆర్ ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేరేడు చర్ల లో న్యూ సమ్మర్ ఐఐటి క్యాంపు



నేరేడుచర్ల, మే 10(తీన్మార్ న్యూస్): ఐఐటిలలో చదివిన విద్యార్థులు అన్ని రంగాలలో ముందుండి, ఆయా రంగాలలో తమదైన ముద్ర వేస్తున్నారు. పాఠశాల విద్య మరియు పోటీ పరీక్షల మధ్య ఉన్న ఈ అంతరాన్ని సమర్థమైన కోచింగ్ మరియు మెంటరింగ్‌తో తగ్గించవచ్చు. అందుకోసం మన నేరేడుచర్ల మండల కేంద్రంలో నూతనంగా చాణక్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఐఐటి ఫౌండేషన్ నేరేడుచర్ల లోని శ్రీ అంజలి హై స్కూల్ ప్రక్కన సూరోజు ఉపేంద్ర చారి అధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ప్రారంభించారు. నేరేడుచర్ల మరియు పాలకీడు, గరిడేపల్లి మండలం లోని విద్యార్థిని, విద్యార్థులు ఐఐటి కోచింగ్ కోసం దూర ప్రాంతాలకు వెళ్లారు. అలా కాకుండా దగ్గర లో ఉండే విధంగా దాదాపు 20సంవత్సరాల ఎక్స్పీరియన్స్ ఉన్నటువంటి బోధన సిబ్బంది తో కోచింగ్ ప్రారంభించారు. విద్య వ్యాపారం కాకూడదు అని అతి తక్కువ ఫీజులతో కోచింగ్ మొదలు పెట్టారు. దీనిలో భాగంగా మాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ సబ్జెక్ట్స్ ని ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు బోధించడం జరుగుతుందన్నారు. స్పెషల్గా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఇంగ్లీష్ క్లాసెస్ జరుపబడును.

# రంగాపురం గ్రామంలో జోరందుకున్న కాంగ్రెస్ పార్టీ ప్రచారం



పెబ్బేరు, మే 10(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలంలోని రంగాపురం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ప్రచారం జోరు అందుకుంది. నాగర్ కర్నూల్ గడ్డమీద కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసే దిశగా రంగాపురం కాంగ్రెస్ నాయకులు బి.రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం జోరుగా సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, అమలు చేసిన హామీలు వివరిసస్తూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తమ వంతు కృషిగా నేతలందరూ కలిసి కట్టుగా ఇంటింటి ప్రచారం చేస్తున్నారు. ఓటర్ల ఇళ్లకు వెళ్లి, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన గ్యారంటీ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా ప్రజల కోసమే పోరుడుతుంది, రైతుల కోసమే కొట్లాడుతుందని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరిగిందని, తప్పకుండా విజయం సాధిస్తుందని తెలిపారు. వచ్చే ఏడాది నుంచి ఉపాధి కూలీలకు ప్రతీ రోజు నాలుగు వందలు అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ పెద్దింటి చంద్రయ్య, నాయకులు సాయిరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, కోటిష్వర్ రెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ పెద్దింటి రామకోటి, ఎస్సి సెల్ కార్యదర్శి దారపోగు వెంకటేష్, బెరికీ లక్ష్మణ్, ఆటో బాలస్వామి, కటికల ఎల్లస్వామి, బీసన్న, పిట్ట మన్యం, పిట్ట నాగేంద్రం, పిట్ట రాములు, దాది రాములు, దాది శేఖర్, గొల్ల రాముడు, పెద్దింటి రాజ్ కుమార్, కావలి పెంటయ్య, సింగినేపల్లి మన్యం, పెద్దింటి సంజీవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి బందిఖానా నుండి దేశాన్ని విముక్తి చేద్దాం

**- జై కిసాన్ జై జవాన్ అంటూనే రైతులను సైనికులను పొట్టనబెట్టుకున్న బీజేపీ**

**- పుస్తకాన్ని ఆవిష్కరించిన సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జబ్బర్**



దేవరకద్ర ప్రతినిధి, మే 10(తీన్మార్ న్యూస్): మదనాపురం మండలం, కేంద్రంలో సిపిఎం పార్టీ మదనపురం మండల కమిటీ ఆధ్వర్యంలో పుస్తకావిష్కరణ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండి జబ్బార్ పాల్గొని వారు మాట్లాడుతూ పదేళ్ల మోడీ పాలనలో ధరలు తరస్థాయికి చేరుకున్నాయి పెద్ద నోట్ల రద్దుతో లక్షలాది మందికి ఉన్న ఉపాధి పోయింది. ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరించకపోగా దీనిని మరింతగా నీరుగార్చింది 44 శాతం వంట గ్యాస్ కొరత. 30 శాతం, శానిటేషన్ సౌకర్యాలు లేనివారు. 41 శాతం సొంత ఇండ్లు లేనివారు ఉన్నారు. దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి పైకి తెచ్చామని మోడీ మోడీ ప్రభుత్వం చెప్పుకుంటున్నది. అదే నిజమైతే 81 కోట్ల మందికి ఉచిత బియ్యం అందజేయాల్సిన అవసరం ఎందుకొచ్చిందో వారే సమాధానం చెప్పాలి. ఎలక్ట్రోల్ బాండ్స్ పేరుతో మోడీ ప్రభుత్వం అవినీతి చట్టబద్ధం చేసింది. సుప్రీంకోర్టు మొట్టికాయలతో బిజెపి గుట్టు రట్టయింది. రాష్ట్రాల హక్కులను అధికారాలను మోడీ ప్రభుత్వం అరిస్తున్నది. ఓటుతో ఓడిద్దాం ప్రజలను గెలిపిద్దాం. విదేశాల్లో స్విస్ బ్యాంకులో ములుగుతున్న అవినీతి సొమ్ము తెచ్చి ఈ దేశంలో ప్రతి ఒకరి అకౌంట్లో 15 లక్షల రూపాయలు వేస్తానన్న జన్ ధన్ ఖాతాలు ఖాళీలు ఖాళీగానే వేలవేల పోతున్నాయి. దేశాన్ని అభివృద్ధి చేస్తాడని ప్రజల అధికారమిస్తే ఒక్కొక్క రాజ్యాంగ వ్యవస్థను బలహీనం చేస్తూ నిరంకుశ వైపు అడుగులు వేస్తున్నది మోడీ రాజ్యం. జై కిసాన్ జై జవాన్ అంటూనే రైతులను సైనికులను బిజెపి పొట్టనబెట్టుకున్నది. కార్మికుల హక్కులు కాలరాశారు. పేద మధ్యతరగతి ప్రజలపై విపరీత బారాలు మోపారు. దళిత గిరిజన మైనార్టీలపై దాడులు చేశారు. మహిళలపై అంగీక దాడి చేసిన వారికి మద్దతుగా నిలిచారు. ప్రశ్నించే వారిని ప్రజాస్వామ్య హక్కులు కావలన్న వారి మీద దేశద్రోహం ముద్రవేశారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తూ మహబూబ్నగర్ పార్లమెంటు ఎంపీ అభ్యర్థి వంశీచంద రెడ్డి గారి కి హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి.వెంకట్ రాములు, సిపిఎం మండల నాయకులు విష్ణు, చెన్నయ్య, చిరంజీవి, మొగిలి, చిర్ల ప్రసాదు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కుపై ప్రతిజ్ఞ కార్యక్రమం



ఆత్మకూర్, మే 10(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక మండల మహిళ సమైక్య భవనంలో శుక్రవారం రోజు మహిళా మండలి సమైక్య అధ్యక్షురాలు మహేశ్వరి ఆధ్వర్యంలో వజ్రాయుధమైన టువంటి ఓటు హక్కు పై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం వెంకటేష్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క భారతీయ పౌరుడు తమ వజ్రాయుధ మైనటువంటి ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీలు అన్వర్ పాషా, ఆంజనేయులు, వివోఏలు రవి, జయమ్మ, వివిధ గ్రామాల మహిళ సమైక్య గ్రామ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న మహిళల కుట్టు శిక్షణ కార్యక్రమం







ఆత్మకూర్, మే 10(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మండల మహిళా సమైక్య భవనంలో శుక్రవారం రోజు ఆత్మకూరు అమరచింత మండలాలకు చెందిన టైలరింగ్ చేసే మహిళలకు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదివే బాల బాలికలకు ఆ పాఠశాలలో విద్యార్థులకు దుస్తులు కుట్టుటకు శిక్షణ కార్యక్రమం రెండవ రోజు కొనసాగుతుంది. శిక్షకుడు కొత్తకోట శ్రీనివాస్ శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో అమరచింత, ఆత్మకూరు మండల ఎంఎంఎస్లు మహేశ్వరి, సునీత ఏపిఎం వెంకటేష్, సీసీలు అన్వర్ పాషా, ఆంజనేయులు, వివిధ గ్రామాల మహిళా సమైక సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ బీర్ల సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మాజీ వైస్ ఎంపీపీ



రాజాపేట, మే 10(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల మాజీ వైస్ ఎంపీపీ, రేణిగుంట గ్రామానికి చెందిన టిఆర్ఎస్ నాయకులు రంగల్ల కృష్ణ తన అనుచర వర్గంతో శుక్రవారం ప్రభుత్వ విప్ అలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. భారీగా తన అనుచర వర్గంతో ఆయన కాంగ్రెస్ పార్టీ కండువాను కప్పుకున్నారు. పార్టీలోకి సాదరంగా స్వాగతం పలికిన బీర్ల ఐలయ్య సంతోషం వ్యక్తం చేసి రాంగళ్ల కృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. రామ్ గళ్ళ కృష్ణ రాకతో మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అయిందని అన్నారు. రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నమిల మహేందర్ గౌడ్, బుడిగె పెంటయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మృతుని కుటుంబానికి బియ్యం అందజేత



రాజాపేట, మే 10(తీన్మార్ న్యూస్): రాజాపేట మండల కేంద్రం కొత్త కాలనీ కి చెందిన మామిడి పెంటయ్య ఇటీవల మరణించగా శుక్రవారం కుటుంబానికి రేగు సిద్ధులు 50 కేజీల బియ్యం ఆర్థిక సహాయంగా అందజేసారు . ఈ కార్యక్రమంలో ఎర్ర గోకుల జశ్వంత్, సంగెం మధు, నేమిల ఉపేందర్ గౌడ్, బిల్ల కుదురు రాజు, కృష్ణ, సిరిపంగ మహేష్, గుర్రం శ్రవణ్, ఆగుళ్ల మహేష్, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

# చలో జన జాతరకు బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు





ఆత్మకూర్, మే 10(తీన్మార్ న్యూస్): మక్తల్ నియోజకవర్గం కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మహబూబ్నగర్ పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జిల్లా వంశీ చందర్ రెడ్డి గెలుపే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి సారథ్యంలో శుక్రవారం జరగబోయే జన జాతర సభకు మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆదేశానుసారం మూలమల్ల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి.రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో చలో జన జాతర సభకు భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు భారీ ఎత్తున బయలుదేరారు. ఈ కార్యక్రమంలో గ్రామ యూత్ ప్రెసిడెంట్ ఏ సుధాకర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు సైక సహదేవ్, ఎంపిటిసి లక్ష్మన్న, ప్రతాపరెడ్డి, గజేందర్ రెడ్డి తదితర యువ నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి.. తల్లికి బిడ్డకు ఆరోగ్యం

**- డాక్టర్ అల్లెం అప్పయ్య డి ఏం అండ్ హెచ్ ఓ ములుగు**





గోవిందరావుపేట: ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసూతి చేయడం ద్వారా తల్లికి బిడ్డకు ఆరోగ్యము కుటుంబానికి ఆర్థిక భారం కూడా తగ్గుతుందని డి ఏం అండ్ హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. మొదటిగా ఇటీవల నిర్మించిన బర్త్ వెయిటింగ్ వార్డుని పరిశీలించి ముందు ఉన్న చెత్తను పిచ్చి మొక్కలను తొలగించాల్సిందిగా వైద్య అధికారి డాక్టర్ చంద్రకాంతిని ఆదేశించడం జరిగింది. తర్వాత ఓపి రిజిస్టర్ ని గర్భిణీ స్త్రీల రిజిస్టర్ అసంక్రమిత వ్యాధుల రిజిస్టర్స్ ని కూడా పరిశీలించి ఈరోజు డెలివరీ డేట్ ఉన్న మౌనిక అనే గర్భిణికి ఫోన్ చేసి డెలివరీ అయింది లేది తెలుసుకోవడం జరిగింది ఆమె అక్క సమాధానం ఇస్తూ మౌనిక అనే గర్భిణి ఈనెల 8వ తారీఖున వరంగల్లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో ఆపరేషన్ ద్వారా మగ బిడ్డకు జన్మనిచ్చింది అని తెలుపగా డి ఎం అండ్ హెచ్ ఓ ఆరోగ్యశాఖ సిబ్బంది నీ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు చేయించకుండా ఏం చేస్తున్నారని అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నీ సంప్రదించకుండా మీరు ఆత్రుతతో ప్రైవేటు ఆసుపత్రిని సంప్రదించడం జరిగింది ఆపరేషన్ చేయించుకోవడం జరిగింది. దీనివల్ల మీరు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఆమెకు ఆపరేషన్ వల్ల ముందు ముందు అనర్థాలు ఏర్పడే అవకాశం ఉందని వివరించడం జరిగింది. దీని దృష్టిలో పెట్టుకొని సంబంధిత సూపర్వైజర్ లక్ష్మిని మందలించగా ఆమెకు మన ఆశలు ఏఎన్ఎంలు చెప్పినప్పటికీ తల్లి ఊరైన వరంగల్ కు వెళ్లారని వివరించారు ఈ నెలలో 14 డెలివరీలు ఉండగా ఇప్పటివరకు మూడు డెలివరీ లు అయినవి అని వైద్యాధికారి వివరించారు డి ఎం ఎం హెచ్ ఓ కల్పించుకొని వారం రోజుల నుండే గర్భిణీ స్త్రీలకు ఫోన్లు చేసి ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించండి పరిస్థితిని బట్టి ములుగు జనరల్ ఆసుపత్రికి రిఫర్ చేయండి అని ఆదేశాలు ఇవ్వడం జరిగింది తర్వాత ప్రస్తుతమైతే ప్రతి గ్రామములో జరుగుతున్న ఎన్ఆర్జిఎస్ పనుల స్థలాల్లో ఓఆర్ఎస్ ఆశలు పంచుతున్నారు అది ఇంకా ఉధృతం చేసి రావాలని ప్రజలందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రకాంత్ డాక్టర్ అనూష సూపర్వైజర్ లక్ష్మి మరియు స్టాఫ్ నర్స్ ఉన్నారు

# బిజెపిలో చేరికలు

**- కండువా కప్పి ఆహ్వానించిన జిల్లా ప్రధాన కార్యదర్శి ఊట్కూరు అశోక్ గౌడ్**



రాజాపేట, మే 10(తీన్మార్ న్యూస్): రాజపేట మండలం లక్ష్మక్కపల్లి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం లో గత పది సంవత్సరాలలో నరేంద్రమోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై లక్ష్మక్కపెల్లి గ్రామానికి చెందిన పలువురు రాజాపేట మండల బిజెపి పార్టీ అధ్యక్షులు దాచేపల్లి రాజు ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉట్కూరు అశోక్ గౌడ్ సమక్షంలో శుక్రవారం బిజెపి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఏర్పాటు చేశారు. లక్ష్మక్క పెల్లి గ్రామంలో బిజెపి నూతన కమిటీని ఎన్నుకున్నారు. గ్రామ శాఖ అధ్యక్షులుగా ఇంజ విగ్నేష్, ఉపాధ్యక్షులుగా ఇంజ బిక్షపతి, కార్యదర్శిగా మొర్రి బాల సాయిలు ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ ని భారీ మెజారిటీతో తో గెలిపించుకొని ఈ దేశంలో మూడవసారి నరేంద్రమోదీ నాయకత్వాన్ని బలపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శీలం పాపిరెడ్డి, మెడబోయిన శివరాములు, బూడిద విష్ణుమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రచారం కోసం ఉపాధి బాట పట్టిన నాయకులు

**- పని ప్రదేశాల్లో ప్రచారం చేస్తున్న నాయకులు..**
**- పోటా పోటీగా మజ్జిగ,శీతల పానీయాలు పంపిణీ..**

అశ్వారావుపేట: ఎన్నికల ప్రచారం శనివారం నుండి ముగియడంతో నాయకులు ఎన్ని కళ లు ప్రదర్శించాలో అన్నింటిని చాకచక్యంగా ప్రదర్శిస్తున్నారు. ఉపాధి కూలీలే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రధానంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు కూలీలు కంటే ముందే ఉపాధి పని ప్రదేశాలకు చేరుకుంటున్నారు. ఎన్నికల కరపత్రాలు,నమూనా బ్యాలెట్ వెంట తీసుకెళ్ళి కూలీలకు ఒకరు కొరకు పోటీగా మజ్జిగ,సీతలా పానీయాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలంలో మొత్తం 46 వేలు పై చిలుకు ఓటర్లు ఉన్నారు. ప్రతీ పార్టీ, నాయకులు రోజు వారీ ఉపాధి కూలీకి వెళ్ళే 3 వేలు పై చిలుకు ఓటర్లు ను మాత్రమే ఓట్లు అడుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఒకరు మజ్జిగ ఇస్తే మరొకరు కూల్ డ్రింక్స్ ఇస్తున్నారు. అంటే ఆయా నాయకులు ప్రచారం



చేస్తూ ఫొటోలు కు ఫోజులు ఇచ్చే ప్రాధాన్యత నిజంగా పార్టీ కోసం, దాని విజయం కోసం ఇవ్వడం లేదేమో అనిపిస్తుంది అని కూలీలే వ్యాఖ్యానిస్తున్నారు.

# అవినీతికి పాల్పడిన వారిని వదిలే ప్రసక్తి లేదు

**- క్రషర్లను సీజ్ చేసి భూములను పేదలకు ఇప్పిస్తా**
**- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**
**- ఆరూరి పై ధ్వజమెత్తిన జి ఎస్ ఆర్**

శాయంపేట : మాందారిపేట గుట్టల్లో పేదల భూములను గుంజుకొని, హనుమకొండ, వరంగల్ పట్టణాల చుట్టూ శివారు భూములను కబ్జా చేసి అక్రమాస్తులను కాపాడుకోవడానికి బిఆర్ఎస్ పార్టీ నుండి బిజెపికి వచ్చి ప్రజల రక్తం తాగే దొంగల భరతం పడతానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆరూరిపై ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోరుతూ శుక్రవారం రాత్రి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్నర్ సమావేశంలో ఎమ్మెల్యే జి.ఎస్.ఆర్ పాల్గొని మాట్లాడారు. ముందుగా కాంగ్రెస్ నాయకులు డప్పు చప్పుళ్ళ, డిజె సాంగ్ లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని గుట్టల్లో క్రషర్లను సీజ్ చేసి ఆ భూములను పేదలకు ఇస్తానని అన్నారు. ప్రగతి సింగారంలో భూములకు పట్టాలు చేస్తామని, ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన వ్యక్తులను ఎవరిని వదిలిపెట్టేది లేదని, కటకటాల్లో పెట్టిస్తానని, అవినీతి చేసిన ఎవరినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. పెద్ద కొడపాక రెవెన్యూ శివారు పరిధిలో గుడిసెలు వేసుకున్న అర్హులైన నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇచ్చి ఇండ్లు నిర్మించి ఇస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఐదు గ్యారెంటీ పథకాలను అమలు చేసిందని, ఎన్నికల కోడ్ పూర్తి



కాగానే నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇస్తామని అన్నారు. పార్లమెంటు ఎన్నికలలో భూపాలపల్లి నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థి కావ్యకు లక్ష మెజార్టీ అందిస్తే ముఖ్యమంత్రితో మాట్లాడి నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తానని అన్నారు. బిఆర్ఎస్, బిజెపి పార్టీలు ఒక్కటేనని అన్నారు. పార్లమెంట్ ఎన్నికలలో ప్రజలే తమ ఓట్లతో ఆ పార్టీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం కొప్పుల గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు ఎమ్మెల్యే జి ఎస్ ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయ కులు కటంగూరి రామ్ నర్సింహారెడ్డి, దొమ్మాటి సాంబయ్య, సిపిఎం భూపాలపల్లి, హనుమకొండ జిల్లా కార్యదర్శిలు బందు సాయిలు, బోట్ల చక్రపాణి, ఎంపిటిసి బాసాని చంద్రప్రకాష్, మాజీ సర్పంచులు కందగట్ల రవి, అబ్బు ప్రకాష్ రెడ్డి, గోలి మాధురి మహేందర్ రెడ్డి, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, పరకాల ఏఎంసి మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాసరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి బత్తిని సదానందం, అనుకారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# వాహన తనిఖీల్లో భారీగా నగదు స్వాధీనం

కరీంనగర్ : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా, ఎన్నికల కోడ్ వెలువడినందున అక్రమ డబ్బు, మద్యం సరఫరా అరికట్టేందుకు కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని టవర్ సర్కిల్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో కరీంనగర్ మానకొండూర్ మండలం చెంజర్ల గ్రామానికి చెందిన అలగం కుమారస్వామి వద్ద నుండి సరైన ఆధారాలులేని (88,000/-) ఎనభై ఎనిమిది వేల రూపాయలను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సరిలాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన డబ్బును తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు. కరీంనగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో సరైన ఆధారాలు లేని (18,75,651/-)పద్దెనిమిది లక్షల డెబ్బై ఐదు వేల ఆరు వందల యాబై ఒక్క రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఐబీ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో కరీంనగర్ రామడుగు మండలం గుండి గ్రామానికి చెందిన గుమ్మడి రమేష్ నుండి సరైన ఆధారాలులేని 6,00,000/- ఆరు లక్షల



రూపాయలను,మానకొండూర్ మండలం ఊటూరు గ్రామానికి చెందిన పడాల హరీష్ నుండి 12,75,651 పన్నెండులక్షల డెబ్బైఐదువేల ఆరువందల యాభై ఒక్క రూపాయలను పట్టుకుని స్వాధీన పరుచుకున్నామని కరీంనగర్ టూ టౌన్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టుబడిన డబ్బును తదుపరి ప్రక్రియకు సంబంధిత అధికారుల వద్దకు తరలించామని తెలిపారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

**: గిన్నారపు మహేందర్**

ధర్మసాగర్: భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కార్మిక రత్న అవార్డు గ్రహీత జిన్నారపు మహేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలి ఇచ్చి



వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వెల్ఫేర్ బోర్డు కి ఇప్పటివరకు చెర్మెన్ ను నియమించలేదని, వెల్పర్ బోర్డుకు మా కార్మికుడినే చైర్మన్ గా నియమించాలని కోరారు. భవన నిర్మాణ కార్మికులకు గత ప్రభుత్వం అర కొర పథకాలతో మా పొట్టకొట్టిందన్నారు. మాకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను డిమాండ్లను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా కోరారు. కార్మిక పక్షాన గత ప్రభుత్వం లో వున్న సంక్షేమ పథకాలను రెండింతలు చేయాలని గుర్తు చేశారు. 55సంలకే పెన్షన్ సౌకర్యం కల్పించి ఆదుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రప్రచార కార్యదర్శి నల్ల స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు గిన్నారపు,రేణుకుమల్ల శ్యామ్,దువ్వటి సాంబయ్య,మల్లంపల్లి ఎంపీటీసీ బిరెడ్డి కరుణాకర్ రెడ్డి,మాజీ సర్పంచ్ సింగారపు రమేష్,మాజీ సర్పంచ్ నరబోయిన ఎల్లాస్వామి,ముఖ్య నాయకులు గిన్నారపు రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కెసిఆర్ బస్సు యాత్రలో దొంగలు తమ చేతివాటం

**- 5 తులాల బంగారం,50 వేల నగదు, 2 పర్సులీ మాయం**

హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ బస్సు యాత్రలో దొంగలు తమ చేతి వాతాన్ని ప్రదర్శించారు. దీనితో పోలీసుల వైఫల్యం బయటపడింది. నిజాం పెట్ డిప్యూటీ మేయర్ సోదరుడి మెడలో 3తులాల గొలుసు, దుండిగల్ స్థానికుడు పిఎసిసి వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ అనే వ్యక్తి మెడలో 2తులాల గొలుసు మాయం అయింది. దుండిగల్ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి సోదరుడి వద్ద పర్సు దొంగలు కాజేశారు. బౌరాం పెట్ కౌన్సిలర్ భర్త మురళీ యాదవ్ వద్ద గల 50వేల నగదు చోరీ చేశారు. దుండీగల్ తాండ నివాసి జగన్ నాయక్ అనే వ్యక్తి జేబులో నుండి కేటుగాళ్లు పర్సు మాయం చేశారు. ఈ ఘటనలపై బాధితులు పోలీస్ కేసు నమోదు చేశారు.

# రైల్వే ను పరిరక్షించి, కార్మికుల హక్కులను కాపాడుతాం

**పద్మారావు హామీ**

సికింద్రాబాద్: రైల్వే సిబ్బంది ప్రయోజనాలను పరిరక్షించేలా తమ వంతు కృషి చేస్తామని, రైల్వే కార్మికుల పక్షాన వారి గళాన్ని పార్లమెంటులో వినిపిస్తామని సికింద్రాబాద్ బీ.ఆర్.ఎస్. అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ తెలిపారు. గురువారం లాలాగూడ లోని రైల్వే వర్క్ షాపు వద్ద కార్మిక సంఘాల నేతలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీ.ఆర్.ఎస్.కు ఎన్నికల్లో మద్దతు పలకాలని రైల్వే కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మెట్టుగూడ కార్పొరేటర్ రాసురి సునీత రమేష్, కార్మిక సంఘాల నేతలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తీగుల్ల పద్మారావు గౌడ్ మాట్లాడుతూ రైల్వేలో ప్రయివేటీకరణ వల్ల కార్మికుల ప్రయోజనాలు దెబ్బతింటున్నా యని విమర్శించారు. పాత పించను విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండుకు తాము మద్దతు తెలుపుతామని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. శాసనసభ్యుడిగా, రాష్ట్ర మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ గా వ్యవహరించిన దశల్లో కార్మికులకు అందుబాటులో నిలిచానని, ఎంపీగా అవకాశం కల్పిస్తే వారి శ్రేయస్సుకు పాటు పడతానని అన్నారు. జంటనగరాల్లో రైల్వే క్వార్టర్స్ మరమ్మత్తులు, కొత్త క్వార్టర్స్ నిర్మాణం, మౌళిక సదుపాయాలు మెరుగుపరచాలని గతంలో సైతం రైల్వే మంత్రికి, జీ.ఎం.కు వివిధ సందర్భాల్లో ప్రతిపాదించామని తెలిపారు. లాలాగూడ కేంద్రీయ రైల్వే ఆసుపత్రిలో సదుపాయాల మెరుగుదల, అంబులెన్స్ సదుపాయాల ఏర్పాటు, జెనెరిక్ మెడిసిన్స్ కౌంటర్ ఏర్పాటు కరోనా వాక్సిన్ రైల్వే ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు అందించేలా గతంలో తమ ప్రభుత్వం నుంచి అనుమతి సాధించామని తెలిపారు. రైల్వే ఆసుపత్రిలో కరోనా బెడ్స్ ఏర్పాటు, ఇసోలేషన్ వార్డులను ఏర్పాటు చేయించామని, లాలాగూడ రైల్వే వర్క్ షాప్ ఉత్పాదనను పెంచేందుకు నిధులు మంజూరు చేయాలనీ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రతిపాదించామని తెలిపారు. రైల్వే లాండ్స్ పరిరక్షించుకొనేందుకు



సహకరిస్తూనే అడ్డగోలుగా నిర్మించే ప్రహరీ గోడల వల్ల రైల్వే సిబ్బంది, స్థానికులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని అధికారులకు తెలియచేశామని, కాజీపేట్ లో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి స్థానిక నిరుద్యోగులకు అవకాశాలు కల్పించాలని ప్రతిపాదించా మని తెలిపారు. తాజాగా ఇటీవల రంజాన్ మాసంలో రైల్వే ఉద్యోగులకు పవిత్ర రోజా ఉపవాస దీక్షలు జరుపుకొందేందుకు వీలుగా ఇళ్ళకు ముందుగా చేరుకొందుకు ప్రతిపాదించి అనుమతిని సాధించామని, సితాఫలమండీ ని మోడల్ స్టేషన్ గా అభివృద్ధి చేయాలనే ప్రతిపాదనలను మొట్ట మొదటి సారిగా 2016 లో అందించడం జరిగింది. రైల్వే ఉద్యోగుల పిల్లల ఉన్నత విద్యావకశాలకు వీలుగా మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ ఏర్పాటు చేయాలని, క్రీడలకు ఉపకరించే హాకీ అకాడమి ఏర్పాటు చేయాలని తామే ప్రతిపాదించామని తెలిపారు. రైల్వే జూనియర్ కాలేజీ గుర్తింపు రుసుం తగ్గించేందుకు వీలుగా అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి ఆర్డర్స్ తెప్పించామని, స్థానిక విద్యార్థులకు సీట్స్ పెంచేలా జీ.ఎం. పై వత్తిడి తెచ్చామని పద్మారావు గౌడ్ పేర్కొన్నా రు. కాగా పద్మారావు గౌడ్ తో రైల్వే ఓబీసీ ఉద్యోగుల సంఘం నేతలు, పాత పించను పునరుద్దరణ కమిటి ప్రతినిధులు సమావేశమయ్యారు.

# జీవన్ రెడ్డి గెలుపుకోసం చిన్నారుల ఆరాటం


**చేతి గుర్తుకు ఓటువేయాలని ప్రచారం**
**సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వైనం**

జగిత్యాల: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం లోని జగిత్యాల సెగ్మెంట్ లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్ రెడ్డి గెలుపు కోసం చిన్నారులు ప్రచారం చేస్తూ అందరిని ఆకర్షిస్తున్నారు. కాంగ్రెసు పార్టీ ప్రచార పోస్టర్లను ప్రదర్శిస్తూ జీవన్ రెడ్డి ని గెలిపించాలని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ అందరిని ఆకట్టుకుంటున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో రోజు రోజుకు ప్రజల్లో కాంగ్రెస్ పార్టీకి ఆదరణ లభిస్తుండడంతో జీవన్ రెడ్డి ప్రచారంలో అందరికంటే ముందు దూసుకు పోతున్నారు. 40 ఏళ్లుగా ప్రజా జీవితంలో ఉంటూ అందరికి అందుబా టులో ఉండి సమస్యల పరిష్కారం, అభివృద్ధి చేశారని చెబుతూ ఈసారి జీవన్ రెడ్డిని ఎంపీగా గెలిపించుకుంటామని గ్రామాల్లో ప్రజలు ఎవరికి వారే తామే అభ్యర్థిమనే భావించి ప్రచారం చేస్తున్నారు. అలాగే జగిత్యాల పట్టణం అశోక్ నగర్ కు చెందిన సార ఆయాన్స్ రెడ్డి, సార అద్విరెడ్డి అనే మూడు సంవత్సరాల కవల పిల్లలు జీవన్ రెడ్డి గెలుపుకోసం కాంగ్రెస్ జెండాలు, కరపత్రాలను ప్రదర్శిస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. అలాగే తాటిపర్తి అక్షారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకొని జగిత్యాల పట్టణంలో ప్రచారం చేస్తూ చేతి గుర్తుకు ఓటువేసి జనం మెచ్చిన నాయకుడు జీవన్ రెడ్డి ని గెలిపించి నిజామాబాద్ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. పెద్దలు, ఉద్యోగులు, మేధావులతో పాటు అన్ని వర్గాల వారు చేతి గుర్తుకు ఓటువేసి ఎల్లప్పుడూ అందుబాటు లో ఉండే జీవన్ రెడ్డిని నిజామాబాద్ ఎంపీగా గెలిపించాలని చిన్నారులు విజ్ఞప్తి చేశారు. ఈనెల 13 న జరిగే పోలింగ్ లో విజ్ఞులైన మీరందరు జీవన్ రెడ్డి చేతి గుర్తు కు ఓట్లు వేసి భారీ మెజారిటీతో ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశా రు.ఎన్నికల అనంతరం మిమ్మల్ని తప్పకుండా కలుస్తా మంటూ , జీవన్ రెడ్డికి ఉండాలని సోషల్ మీడియాలో ముమ్మ రంగా ప్రచారం చేస్తున్నారు.

# అర్వింద్ గల్ఫ్ బోర్డు వ్యతిరేకి

**గల్ఫ్ బాధిత కుటుంబలకు క్షమాపణ చెప్పాలి**
**టిపిసిసి రాష్ట్ర ఎన్నారై సెల్ కన్వీనర్ షేక్ చాంద్ పాషా**

జగిత్యాల: గల్ఫ్ బోర్డు వ్యతిరేకి నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ అని, గల్ఫ్ బాధిత కుటుంబాల గురించి మాట్లాడే అర్హత బిజెపి పార్టీకి, అర్వింద్ కు లేదని టిపిసిసి రాష్ట్ర ఎన్నారై సెల్ కన్వీనర్ డాక్టర్ షేక్ చాంద్ పాషా అన్నారు.గురువారం జగిత్యాల జిల్లా కేంద్రంలో పర్యటించిన అర్వింద్ గల్ఫ్ బోర్డు, జీవన్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా చాంద్ పాషా మాట్లాడుతూ అనేక ఉద్యమాల మాదిరిగానే, గల్ఫ్ ఉద్యమం పుట్టింది.. కూడా జగిత్యాలలో అని గుర్తు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నానాడు గల్ఫ్ కుటుంబాలపై ఎనలేని ప్రేమను ఒలకబోసిన బీఆర్ఎస్, బిజెపిలు పదేళ్లు అధికారం లో ఉండి గల్ఫ్ బాధిత కుటుంబలకు, గల్ఫ్ కార్మికులకు చేసిన సేవలు, కృషి శూన్యం అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో గల్ఫ్ కుటుంబలకు అండగా నిలిచింది ఆనాటి అధికార కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. గల్ఫ్ లో మృతి చెందిన మృతుల కుటుంబాలకు ఎక్స్గ్రేషియ కింద రూ. లక్ష పరిహారం అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. శంషాబాద్ ఏయిర్ పోర్ట్ నుండి గల్ఫ్ మృతులను వారి స్వగ్రామాలకు తరలించేందుకు ప్రభుత్వం ద్వారా ఉచిత అంబులెన్సు సేవలు ఏర్పాటు చేసిన విషయం గుర్తుంచుకోవాలన్నారు. హోమ్ క్యాబ్ సంస్థ ద్వారా ప్రత్యేక అధికారిని నియమించి, నైపుణ్య శిక్షణ అందించి గల్ఫ్ కుటుంబాలకు అండగా నిలిచిందన్నారు. ప్రభుత్వం తరుపున గ్రామ గ్రామాన గల్ఫ్ సభలు నిర్వహించడం తో పాటు, నకిలీ ఎజెంట్లు, ట్రావెల్స్ పై ఉక్కుపాదం మోపిన విషయాన్నీ అర్వింద్ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఉమ్మడి రాష్ట్రం లో హైదరాబాద్ లో ఉన్న పాస్ పోర్ట్ కార్యాలయంను కరీంనగర్, నిజామాబాద్ కేంద్రాలకు తెచ్చిన ఘనత అప్పటి ఎంపీ మధు యాస్కి కి దక్కిందన్నారు. గల్ఫ్ బాధితుల పక్షాన పోరటం చేసి అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిష్టమని పేర్కొన్న బీజేపీ అధికారం లోకి వచ్చిన పదేళ్లలో గల్ఫ్ కార్మికులకు, బాధిత కుటుంబలకు చేసింది ఏమిటో అర్వింద్ చెప్పాలని పాషా డిమాండ్ చేశారు. గల్ఫ్ కార్మికులు, బాధిత కుటుంబాల గురించి గానీ, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ని విమర్శించే అర్హత అర్వింద్ కు ఎక్కడిదని ప్రశ్నించారు. ప్రభుత్వం భూమిలు అమ్మి గల్ఫ్ కార్మికులను, బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చిన కేసీఆర్ పదేళ్లు అధికారంలోకి ప్రభుత్వ నాయకులు భూములు



కబ్జాలు చేసుకున్నారే తప్ప, కార్మికుల సంక్షేమం కోసం సెంటు భూమి కూడా అమ్మిన దాఖలాలు లేవని, ఈ విషయంను కేసీఆర్ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. బొంబాయి భీవండి బొగ్గుభాయి అంటూ ఊకదంపుడు ఉపన్యాసలతో ఊదారగొట్టిన ఉద్యమ నేత అధికారంలోకి రాగానే వాగ్దానలు గాలికి వదిలేసింది వాస్తవం కాదా అని చంద్ పాషా ప్రశ్నించారు. ఎన్అర్ ఐ సెల్ ఎందుకు ఏర్పాటు చేయలేదో, రూ.500 కోట్లు ఎందుకు కేటాయించలేదో గల్ఫ్ కుటుంబలకు బీఆరెస్ నాయకులు సమాధానం ఇస్తూ ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో మృతుల కుటుంబాలను ఎనడైనా అర్వింద్ పరామర్శించ్చాడా? ఒక్క గల్ఫ్ కుటుంబాన్ని అయిన ఆదుకున్న చరిత్ర అర్వింద్ కు ఉందా? ఆత్మవిమర్శ చేసుకొని వాటిపై శ్వేతాపత్రం విడుదల చెయ్యాలని డిమాండ్ చేశారు.

ముస్లిం సమాజం పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఒక ముస్లిమ్ అయి ఉండి కూడా అనేక మంది హిందూ సోదరుల గల్ఫ్ మృతదేహాలను మోసిన చరిత్ర నాకుందని, అలాంటి మమ్మల్ని సిమి లాంటి ఉగ్ర సంస్థలతో మా జాతిని పోల్చిన అర్వింద్ పై భేషరతుగా సుమోటో కింద కేసు నమోదు చెయ్యాలని పాషా విజ్ఞప్తి చేశారు. హిందూ ముస్లిమ్ భాయ్ భాయ్ అనేలా, మత సామరస్యానికి ప్రతీకగా ఉన్న జగిత్యాల ప్రాంతంలో విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన అర్వింద్ పై కేసులు నమోదు చేయాలనీ చంద్ పాషా పోలీసులకు, ఎన్నికల కమిషన్ కు విజ్ఞప్తి చేశారు.

# అధికార పార్టీ ఎమ్మెల్యేల్లో భయం..భయం...

హైదరాబాద్: పార్లమెంట్ నియోజకవర్గాలకు ఇన్ చార్జులుగా ఉన్న కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు సీరియస్‌గా క్యాంపెయిన్ చేస్తున్నారు. ఒకవేళ అనుకున్న ఫలితాలు రాకపోతే అధిష్టానం నుంచి చివాట్లు తప్పవనే ఆందోళన వారిలో కనిపిస్తున్నది. రెండురోజుల క్రితం కేసీ వేణుగోపాల్ ఎన్నికల ప్రచారం తీరుపై మంత్రులు, ఎమ్మెల్యేలు, అభ్యర్థులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఇందులో కొందరు మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేయడంతో, సదరు లీడర్లలో కదలిక వచ్చినట్టు తెలుస్తున్నది. ఈనెల 10,11 తేదీల్లో ఏఐసీసీ నేతలు రాహుల్, ప్రియాంక గాంధీ రాష్ట్రానికి రానున్నారు. దీంతో వారు పాల్గొనే సభలు, రోడ్డుషోల విజయవంతానికి ప్రత్యేక దృష్టిపెట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపోటములు మంత్రులు, ఎమ్మెల్యేలకు చాలెంజ్‌గా మారాయి. ఇన్ చార్జులుగా ఉన్న స్థానాల్లో అభ్యర్థులు గెలిస్తే పదవులు దక్కుతాయని, ఓడితే ఉన్న పదవులు ఊడుతాయనే సంకేతాలను అధిష్టానం ఇచ్చినట్టు చర్చ జరుగుతున్నది. ఈ విషయాన్ని గ్రహించిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు తమ సొంత ఎన్నికల కంటే ఎక్కువ సీరియస్‌గా తీసుకుని పనిచేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రధానంగా గట్టి పోటీ ఉన్న సెగ్మెంట్లలో పార్టీ అభ్యర్థి విజయం కోసం పలు రకాలు వ్యూహాలను అమలు చేసేందుకు రెడీ అయ్యారు. ఇప్పటివరకు ఎన్నికల ప్రచారం చేయని ప్రాంతాల్లో రానున్న మూడు రోజుల్లో పర్యటించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. అలాగే పోల్ మేనేజ్మెంట్‌పై కూడా దృష్టి పెట్టినట్టు తెలుస్తున్నది. ఏ విధంగా పోల్ మేనేజ్మంట్ చేయాలో తమ కేడర్‌కు ఇప్పటికే దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. ఈనెల 10, 11 తేదీల్లో రాష్ట్రానికి రాహుల్, ప్రియాంక రానున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే సభలు, రోడ్డు షోల సక్సెస్ కోసం ప్లాన్ చేస్తున్నారు. తమ సొంత నియోజకవర్గాల్లో ఓటింగ్‌పై మంత్రులు, ఎమ్మెల్యేలు ఎక్కువ ఫోకస్ పెట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమకు వచ్చిన ఓట్ల కంటే లోక్‌సభ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఒకవేళ తక్కువ ఓట్లు వస్తే, హైకమాండ్ నుంచి చివాట్లు తప్పవనే ఆందోళన వారిలో కనిపిస్తున్నది. అందుకని నియోజకవర్గంలోని పలు వర్గాలతో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీల ఓట్లు రాబట్టేందుకు ప్లాన్ చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రాంతంలోని మైనార్టీ ఓటు బ్యాంకును ఆకర్షించేందుకు కాంగ్రెస్ లీడర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో మంత్రులు, ఎమ్మెల్యేల కదలికలపై కాంగ్రెస్ అధిష్టానం ఎప్పటికప్పుడు రిపోర్టులు తెప్పించుకుంటున్నది. కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికలను సీరియస్ గా తీసుకోవడం లేదని ఫిర్యాదులు వెళ్లాయి. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న ఏఐసీసీ నేత కేసీ వేణుగోపాల్ సీరియస్‌గా క్లాస్ తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం ఉంది. పోలింగ్ ముగిసేవరకు లీడర్ల ప్రచారం, పోల్ మేనేజ్మెంట్‌పై కూడా అధిష్టానం ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది.

# ఎన్నికల పనుల్లో చేతి వాటం....

హైదరాబాద్: ఎలక్షన్స్ వచ్చాయంటే చాలు వారికి ఫుల్ హ్యాపీ.... వాస్తవానికి వారు జీహెచ్‌ఎంసీలో పనులు చేయించాల్సిన ఇంజినీర్లు. కానీ ఎన్నికలొచ్చాయంటే చాలు వారు కాంట్రాక్టర్లుగా మారిపోతారు. అడపాదడపా పనులు చేయించే లైసెన్స్ కలిగిన కాంట్రాక్టర్లను బినామీలుగా పెట్టుకుని పబ్బం గడుపుకుంటు న్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు సంబంధించి లైటింగ్, వీడియో, డీఆర్సీ సెంటర్లు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు, స్ట్రాంగ్ రూమ్‌ల నిర్మాణం, డీఆర్సీ సెంటర్లలోని సిబ్బందికి భోజనాలు వంటి పనులను కొటేషన్లు, షార్ట్ టెండర్ల ప్రక్రియలతో కేటాయించాలని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే జిల్లా ఎన్నికల అధికారి లిఖితపూర్వకమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో అవి ఏమాత్రం అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అడ్డదారిలో ఎలక్షన్స్ పనులు చేజిక్కించుకుని తమ బినామీ కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ జీహెచ్ఎంసీ ఇంజినీర్లు, అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏ పనికైనా టెండర్ల ప్రక్రియ చేపట్టి, అందులో తక్కువగా కోడ్ చేసిన కాంట్రాక్టర్‌కు గానీ, సంస్థకు గానీ పనులు కేటాయించాల్సి ఉంది. మరీ అర్జెంట్ అయితే కనీసం కొటేషన్లను తీసుకోనైనా, లేక షార్ట్ టెండర్ల ప్రక్రియను నిర్వహించైనా పనులు చేపట్టాలని నిబంధనలు చెబుతుంటే జీహెచ్‌ఎంసీ ఇంజినీర్లు మాత్రం పనులను నామినేషన్ పద్ధతిని కట్టబెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే జిల్లా ఎన్నికల అధికారి లిఖిత పూర్వకమైన ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ జోన్‌లోని నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూం నిర్మాణ పనులను ఓ ఇంజనీర్ చేజిక్కించుకుని తన ఇద్దరు బినామీ కాంట్రాక్టర్లతో పనులు చేయించిన విషయం ఇటీవలే బయటపడినా కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మాసాబ్ ట్యాంక్ సాంకేతిక భవన్‌లో నిర్మించిన నాంపల్లి నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు సదరు ఇంజనీరే చేజిక్కించుకున్నట్లు చర్చ జరుగుతుంది. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన ఆఫీసర్ నిజాంకాలేజీలో ఏర్పాటు చేసిన డీఆర్సీ సెంటర్‌లోని స్టాఫ్‌కు టీ, టిఫిన్, భోజనాలకు సంబంధించిన కాంట్రాక్టును చేజిక్కించుకున్నట్లు సమాచారం. సదరు ఆఫీసర్ ఆ టీ, టిఫిన్, భోనాలను నిజాం కాలేజీ క్యాంటీన్ నుంచే సమకూర్చి భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇదే రకంగా ఖైరతాబాద్ జోన్‌లో మరో ఇంజినీర్, ఉప్పల్‌లో ఓ ఇంజనీర్ పనులు చేజిక్కించుకున్నట్లు సమాచారం. ఎలక్షన్ పనులను నిబంధనలు ఉల్లంఘించి నామినేషన్ పద్ధతిన కేటాయిస్తున్నా, ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు ఖైరతాబాద్ జోన్‌లోని మెహిదీపట్నంకు చెందిన ఇంజినీర్ చేపట్టిన విషయం ఇటీవలే బట్టబయలైన, కమిషనర్ గానీ, జిల్లా ఎన్నికల అధికారి గానీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ గానీ ఎందుకు చర్యలు చేపట్టలేదన్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. అడ్డదారిలో పనులు చేజిక్కించుకుంటున్న ఇంజనీర్లు కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు ఎవరి వాటాలు వారికి అప్పగించటమే వారిపై చర్యలు తీసుకోక పోవడానికి ప్రధాన కారణమా? అంటూ జీహెచ్‌ఎంసీ సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది.

# నీ కింత... నాకింత

## పార్టీ ఫండ్ వాడేసుకుంటున్న నేతలు

వరంగల్: లోక్‌సభ ఎన్నికల వేళ.. వరంగల్ బీఆర్‌ఎస్ పార్టీలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఈ ఎన్నికల్లో తొలుత కడియం కావ్యను బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ అక్కడ ప్రకటించారు. తర్వాతి పరిణామాల్లో ఆమె పోటీకి సిద్ధపడకపోవటంతో అక్కడ మారేపల్లి సుధీర్ కుమార్‌ను తమ అభ్యర్థిగా గులాబీ బాస్ ప్రకటించారు. అయితే, కొత్త అభ్యర్థిగా బరిలో దిగిన సుధీర్ కుమార్‌కు సొంత పార్టీ నేతలే సమస్యలు సృష్టిస్తున్నారు. ముఖ్యంగా లోక్‌సభ ఎన్నికల కోసం అధిష్ఠానం పంపిన పార్టీ ఫండ్‌ను జిల్లాకు చెందిన మాజీ మంత్రి, వరంగల్ పార్లమెంటు పరిధిలోని మాజీ ఎమ్మెల్యేలు కలిసి పంచుకున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిణామంతో బిత్తర పోయిన సుధీర్ కుమార్ పార్టీ పెద్దలకు ఈ విషయం చెప్పి వాపోయినట్లు సమాచారం. ప్రత్యర్థులు ఇంటింటా ప్రచారం ప్రారంభించి మహిళా కార్యకర్తలతో బొట్టు, మెహందీ వంటి కార్యక్రమాలు చేస్తుండగా తాము ప్రచారంలో పూర్తిగా వెనకబడి పోయామని ఆయన అధిష్ఠానంతో మొరపెట్టుకున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా లోక్‌సభ ఎన్నికల వేళ బూత్ కమిటీలు ఏర్పాటు చేయటం, మండలస్థాయిలో పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పార్టీ నేతలు ప్రచారంలో పాల్గొనటం తెలిసిందే. వీటి నిర్వహణ కోసం పార్టీలు తమవంతుగా కొంత సొమ్మును పంపుతుం టాయి. అవసరాన్ని బట్టి అభ్యర్థులు తమ వాటాను కూడా జోడించి, గ్రామాల వారీగా బూత్‌లలో పోలింగ్ రోజున తమ ఓట్ల సంఖ్యను పెంచుకునే ప్రయత్నం చేస్తుంటారు. కానీ, ఈసారి ఇంతవరకు బూత్ కమిటీలకు నయా పైసా అందకపోవటంతో ఆ నేతలంతా నిరాశలో కూరుకుపోయారు. మరోవైపు గతంలో ఇక్కడ సీటు కోసం కోట్ల రూపాయలు ఖర్చు పెడతామని తిరిగిన నేతలెవరూ ఇప్పుడు నియోజక వర్గంలో కనిపించటం లేదు. వరంగల్ సీటు పరిధిలో విపక్ష బీజేపీ, అధికార కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే గ్రామాల స్థాయి ప్రచారం చేస్తుంటే, తమ పార్టీ నేతలు ఇల్లు కదలకపోవటం పట్ల గులాబీ పార్టీ కేడర్ మండిపడుతోంది. పదేళ్ల తమ పాలనలో మంత్రిగా ఉన్న నేత, ఆయా సెగ్మెంట్లలో ఎమ్మెల్యేలుగా బాగా సంపాదించుకున్న తమ పార్టీ నేతలు చివరికి ఎన్నికల కోసం పంపిన పార్టీ ఫండ్‌ను వాటాలు వేసుకుని మరీ పంచుకు తినటంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరో 3 రోజుల్లో ప్రచార పర్వం ముగియబోతుంటే, ఈ చిల్లర వేషాలేంటని అటు పార్టీ అధిష్ఠానం కూడా చిలక్కొట్టుడు నేతల మీద మండిపడినట్లు సమాచారం. ఎన్నికలంటేనే అందర్నీ కలుపుకొనిపోవాలని, పదేళ్ల పాటు పదవులు అనుభవించిన నేతలు.. పార్టీ ఫండ్‌కు తమ వాటా వేసి, అక్కడి అభ్యర్థిని గెలిపించాల్సింది పోయి, ఇలాంటి చౌకబారు వేషాలు వేస్తే జనానికి ఎలాంటి సందేశం పోతుందని పార్టీ పెద్దలు వాటాలు పంచుకున్న ప్రజాప్రతినిధులను మందలించినట్లు సమాచారం. చివరి నాలుగు రోజులైనా సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో పాల్గొనాలని, ద్వితీయ శ్రేణి నాయకులను కలుపుకుని సుధీర్ కుమార్ గెలుపుకు కృషి చేయాలని పార్టీ ఎన్నికల వ్యవహారాల బాధ్యులు వరంగల్ నేతలను బతిమిలాడు కుంటున్నారని సమాచారం.

# 3 రోజులు మందు షాపులు బంద్

హైదరాబాద్: రాష్ట్రంలో ఈ నెలలో ఎన్నికల సందర్భంగా మూడు రోజులపాటు వైన్స్ షాపులు మూసివేయనున్నారు. ఈ నెల 11, 12, 13వ తేదీల్లో వైన్స్ షాప్‌లు బంద్ చేయనున్నారు. మే 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం వరకు ఈ మందు దుకాణాలు మూసే ఉంటాయి. మన రాష్ట్రంలో 13వ తేదీన పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. పోలింగ్ తేదీకి ముందు రెండు రోజుల పాటు ప్రచారం ముగుస్తుంది. ప్రలోభాల పర్వం అసలే జరగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఇందులో భాగంగా వైన్స్ షాపులు బంద్ చేయనున్నారు. పోలింగ్ తేదీతోపాటు కౌంటింగ్ రోజున కూడా వైన్స్ షాప్‌లు మూసివేయనున్నారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు జూన్ 4వ తేదీన వెలువడనున్నాయి. కాబట్టి, 4వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు వైన్స్ షాప్‌లు బంద్ కానున్నాయి. ఈ తేదీల్లో రాష్ట్రంలోని అన్ని వైన్స్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లు మూసివేస్తారు. సార్వత్రిక ఎన్నికలు ఏడు విడతల్లో జరుగుతున్నాయి.

ఇందులో తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరగనుంది. తెలంగాణలో 17 లోక్ సభ ఎన్నికలకు, ఏపీలోని 25 లోక్ సభ స్థానాలకు అలాగే 175 అసెంబ్లీ స్థానాలకు నాలుగో విడతలో భాగంగా ఈ నెల 13వ తేదీన పోలింగ్ జరుగుతుంది. అన్ని విడతల పోలింగ్ ముగిశాక ఓట్ల లెక్కింపు జూన్ 4వ తేదీన నిర్వహిస్తారు.

# మా ఊళ్లో ఆడపిల్ల పుడితే రూ. 2వేలు

నిజామాబాద్: కాలం మారింది... కంప్యూటర్ యుగం వచ్చింది... అయినా ఆడపిల్లలపై ఉన్న వివక్ష మాత్రం పూర్తిగా పోలేదు. ఆడపిల్ల అంటే భారమే అనుకునే తల్లిదండ్రులకు కూడా ఇంకా ఉన్నారు. సమాజంలో లింగవివక్ష.. అక్కడో ఇక్కడో ఎక్కడో ఉంటూనే ఉంది. ఎన్ని చట్టాలు వచ్చినా... గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ పరీక్షలు జరుగుతూ ఉన్నాయి. కడుపులో ఆడపిల్ల ఉందని తెలిస్తే...

కడుపులో చంపేస్తున్న వాళ్లూ ఉన్నారు. అంతేకాదు... ఆడపిల్ల పుట్టిందని ముఖం మాడ్చుకునే తండ్రులూ ఉన్నారు. అమ్మాయి పుట్టిందని... పురిటిలోని బిడ్డను చెత్తకుప్పల్లోనే.. చెత్తకుండీల్లో పడేస్తున్న సంఘటనలు అప్పుడప్పుడూ కనిపిస్తూనే... వినిపిస్తూ ఉన్నాయి. అంటే.. సమాజంలో ఇంకా.. అమ్మాయిల పట్ల వివక్ష పోలేదు. ఆడపిల్ల పుడితే... అంతా ఖర్చే అన్న ధోరణి మారలేదు. చదువుల ఖర్చు... పెళ్లిళ్ల ఖర్చు... అంతా భారమే అనుకుంటున్నారు చాలా మంది. ఆడపిల్లను కనేందుకు ఇష్టపడటం లేదు. పుట్టినా.. ఎలాగోనా వదిలించుకుంటున్నారు చాలా మంది. పట్టణాల్లో కాకపోయినా... మారుమూల పల్లెల్లో ఆడిపిల్లలపై చిన్నచూపు కొనసాగుతూనే ఉంది. అలాంటి ఆడిపిల్లల సంరక్షణ కోసం... ఓ యువ జంట పెద్దమనస్సుతో ముందుకొచ్చింది. తమ గ్రామంలో పుట్టిన ప్రతి ఆడపిల్ల పేరుపై 2వేల రూపాయలు డిపాజిట్ చేయాలని నిర్ణయించుకుని. ఇచ్చేది చిన్న మొత్తమే అయినా... వారి ఆలోచన మాత్రం ఎంతో మంది ఆదర్శవంతమైనది. తన దగ్గర డబ్బులు ఉంటే... బ్యాంకుల్లో దాచుకోవడమో... ఆడంబరాలకు ఖర్చు చేస్తున్నారు. ఆస్తులు పెంచుకుంటారు. కానీ... ఈ దంపతులు మాత్రం సమాజం కోసం ఆలోచించారు. ఆడబిడ్డల భవిష్యత్ కోసం ముందడుగువేశారు. ఇంతకీ ఎవరా దంపతులు..? వారికి ఇలాంటి ఆలోచన ఎందుకు వచ్చింది..? నిజామాబాద్ జిల్లా తాడ్వాయి మండలం ఏండ్రియల్ గ్రామంలో రెడ్డిగారి తిరుపతిరెడ్డి – శ్రావణలక్ష్మి దంపతులు ఉంటున్నారు. వారి పదో వార్షికోత్సవం( సందర్భంగా.. సమాజం కోసం మంచి నిర్ణయం తీసుకున్నారు. జనవరి ఒకటి2024 నుంచి తమ గ్రామంలో... పుట్టిన ప్రతి ఆడపిల్ల పేరు మీద... 2వేల రూపాయలు డిపాజిట్ చేయాలని నిర్ణయించుకున్నారు ఈ దంపతులు. పుట్టిన ఆడపిల్ల పేరుపై... సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిచి.... 2 వేల రూపాయలు వేస్తున్నారు. తమ నిర్ణయం అందరికీ తెలిసేలా ప్రచారం కూడా చేస్తున్నారు. పాంప్లేట్లు వేయించారు. ఆడపిల్ల పుట్టినవారు తమను సంప్రదించాలని కోరుతున్నారు. తమ 10వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా... జనవరి ఒకటి, 2024 నుంచి... ఏండ్రియల్ గ్రామం లో పుట్టిన ప్రతి ఆడపిల్లకు తమ తరపున సుకన్య సమృద్ధి ఖాతా తెరిచి 2వేల రూపాయలు జమ చేస్తామని చెప్తున్నారు. ఆడపిల్ల ఉన్నత చదువులకు, వారి పెళ్లికి ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా... పుట్టినప్పటి నుంచే తల్లిదండ్రులు పొదుపు చేయాలనే అవగాహన కల్పిస్తున్నామని అంటున్నారు ఆ దంపతులు. ఎందరికో ఆదర్శవంతంగా నిలుస్తున్నారు. ఈ దంపతుల్లా ఎంత మంది ఉంటారు. ఎంత మంది వీళ్లలా సమాజం కోసం ఆలోచిస్తారు. నిజంగా వాళ్లకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే.

# ఎమ్మెల్యేలకు వేణుగోపాల్ స్వీట్ వార్నింగ్

హైదరాబాద్: ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగానే వారికి పదవులు ఉంటాయని ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఎన్నికలకు మరో ఐదు రోజులే ఉన్నందున రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కాంగ్రెస్ నాయకులతో జూమ్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ, మంత్రు లు, ఎమ్మెల్యేలు, లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. ఈ భేటీకి మంత్రి దామోదర రాజనర్సింహ, 15 మం ది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడంపై కెసి వేణుగోపాల్ అసహనం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన పలువురు నేతల పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటకు పైగా సాగిన ఈ జూమ్ మీటింగ్‌లో పార్టీ నేతలకు ఆయన దిశానిర్ధేశం చే శారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం, నియోజకవర్గాల్లో పా ర్టీల బలాబలాలు తదితరాల అంశాలపై సిఎం రేవంత్ రెడ్డి, విక్రమార్క, దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు వివరించారు. ఈ సందర్భంగా కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో అధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని, అందుకో సం మరింత ఉత్సాహంతో పని చేయాలని ఆయన సూచించారు. తెలంగాణాలో అధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని ఆయన పేర్కొన్నారు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ బాధ్యతను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి చూసుకుంటారని కెసి వేణుగోపాల్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ స్థానాన్ని నిర్లక్ష్యం చేయటంపై ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై కెసి వేణగోపాల్ అసహనం వ్యక్తం చేశారు. అభ్యర్థి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన నిర్దేశించారు. నియోజకవర్గంలోనే ఉండి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేలను, మంత్రులను సమన్వయం చేయటంలో సరిగా వ్యవహరించడం లేదంటూ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌పై కెసి వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం 'దిశా దశ' మార్చే ఈ ఎన్నికలను ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన ఆదేశించారురు. ఎమ్మెల్యేలు ఎవరూ నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించ వద్దని కెసి వేణగోపాల్ హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న రైతుబంధు కూడా ఇప్పటికే పంపిణీ పూర్తి చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సమావేశంలో వెల్లడించారు. త్వరలో రుణమాఫీ సైతం చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. పార్టీ నిర్ధేశించిన పనిని ప్రతి ఒక్కరూ పూర్తి చేయాలని, పార్టీ నిర్ణయాలను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని సిఎం సూచించారు. జూమ్ మీటింగ్‌లో ఎవరెవరు పాల్గొనలేదో నివేదిక ఇవ్వాలని మహేశ్‌కుమార్ గౌడ్‌ను కెసి వేణుగోపాల్ ఆదేశించారు.

# కేరళలో కొత్త జ్వరం.. 'వెస్ట్ నైల్

తిరువనంతపురం: కేరళలో కొత్త జ్వరం 'వెస్ట్ నైల్' కలవర పెడుతోంది. ఈ జ్వరం వల్ల తీవ్ర అస్వస్థతకు గురి కావడమే కాకుండా ప్రాణాపాయం కూడా ఉందని వైద్య అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య, ఆరోగ్య అధికారులు ఇప్పటికే అప్రమత్తం చేశారు. ఈ రాష్ట్రంలోని మల్లప్పురం, కోజికోడ్, త్రిసూర్ వెస్ట్ నైల్ కేసులు నమోదైనట్లు వైద్య అధికారులు తెలిపారు. వెస్ట్ నైల్ అనే దోమ వల్ల ఈ వ్యాధి ప్రబలుతుందని, ఈ వ్యాధికి సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి మందులు లేవని, వ్యాక్సిన్ సైతం ఇంకా గుర్తించలేదని అంటున్నారు. అయతే ఈ జ్వరం లక్షణాలు ఎలా ఉంటాయి? ఇది రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏవో చూద్దాం..వెస్ట్ నైల్' అనే జ్వరాన్ని 1937లో ఉగాండాలో కనుగొన్నారు. మనదేశంలో దీని ద్వారా 2019లో ఓ బాలుడు చనిపోవడంతో ఇది వెలుగులోకి వచ్చింది. ప్రతీ మాన్ సూన్ కు ముందుగా ఈ వ్యాధి ప్రబలుతుందని వైద్యులు చెబుతున్నారు. వెస్ట్ నైల్ ఫీవర్ ద్వారా ప్రాణాపాయం ఉన్నప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అంటున్నారు. అయితే దీనికి సంబంధించిన కొన్ని లక్షణాలు కనిపిస్తే మాత్రం వెంటనే వైద్యులను సంప్రదించాలని అంటున్నారు. క్యూలెక్స్ జాతికి చెందిన వెస్ట్ నైల్ అనే దోమ కాటు వల్ల ఈ జ్వరం వస్తుంది. ఇది ఉన్న వారు తలనొప్పితో పాటు జ్వరం, తల తిరగడం, కండరాల నొప్పుల వంటి వాటితో అస్వస్థతకు గురవుతారు. అయితే వెస్ట్ నైల్ సోకిన వెంటనే కాకుండా కొన్ని రోజుల తరువాత ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఇది ఎక్కువగా మెదడుపై ప్రభావం చూపుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు చనిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. వెస్ట్ నైల్ కు ఎలాంటి ఔషధాలు లేవని వైద్యులు తెలుపుతున్నారు. ఇప్పటి వరకు వ్యాక్సిన్ కూడా కనుగొనలేదని పేర్కొంటున్నారు. అందువల్ల ముందు జాగ్రత్తగా దోమలు కుట్టకుండా జాగ్రత్త పడాలని అంటున్నారు. అయితే ఈ జ్వరం సోకిన వారికి లక్షణాల ఆధారంగా చికిత్స చేస్తారని అంటున్నారు. లేటేస్టుగా మూడు జిల్లాల్లో వెస్ట్ నైల్ కేసులు నమోదయ్యాయని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య శాఖ మంత్రి తెలిపారు.

# భాగ్యనగరంలో భారీ వర్షాలు

హైదరాబాద్: భాగ్యనగరంలో భారీ వర్షాల వల్ల మంగళవారం రాత్రి జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేణుక ఎల్లమ్మ కాలనీలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్ మెంట్ ప్రహరీ మంగళవారం రాత్రి ఒక్కసారిగా కూలిపోయి దాన్ని ఆనుకొని ఉన్న రేకుల షెడ్డుపై పడింది. ఈ ప్రమాదంలో షెడ్డులో నివసిస్తోన్న ఏడుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో నలుగురు గాయపడ్డారు. ఇక్కడ గతంలో 10 – 15 అడుగుల ఎత్తు వరకూ ప్రహరీ నిర్మించగా.. తర్వాత దానినే 30 – 40 అడుగులకు పెంచడంతో వర్షపు నీటికి పునాదులు బలహీనపడి కూలినట్లు తెలుస్తోంది. మృతులంతా ఒడిశా, ఛత్తీస్ గఢ్ రాష్ట్రాలకు చెందినవారుగా పోలీసులు గుర్తించారు. నిర్మాణంలో నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కేసు నమోదు చేశారు. మరోవైపు, ఈ ఘటనపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్రవ్రగ్భ్భాంతి వ్యక్తం చేశారు.

అధికారులను అడిగి ప్రమాద వివరాలు తెలుసుకున్న ఆయన.. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించిన ఆయన.. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఈ ప్రమాదంలో నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం ఆరుగురిని అరెస్ట్ చేశారు. భవన నిర్మాణదారుడు అరవింద్ రెడ్డి, సైట్ ఇంజినీర్ సతీష్, ప్రాజెక్ట్ మేనేజర్ ఫ్రాన్సిస్, కాంట్రాక్టర్ రాజేష్, మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. వీరిని కోర్టులో హాజరు పరచనున్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన ఏడుగురి మృతదేహాలను పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం వారి బంధువులకు అప్పగించారు. మొయినాబాద్ మండలం చిన్నమంగళారానికి చెందిన జహేరాబేగం (47) మంగళవారం రాత్రి కూరగాయలు కొనేందుకు బయటకు రాగా.. ఆర్చ్ కూలి ఆమె తలపై పడింది. దీంతో తీవ్ర గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె ప్రాణాలు కోల్పోయారు. అలాగే, హయత్ నగర్ ముదిరాజ్ కాలనీకి చెందిన అంజలి అనే మహిళ బుధవారం ఉదయం పెద్దఅంబర్ పేట్ మున్సిపల్ పరిధిలో ఇంటింటి చెత్త సేకరణ కోసం స్వచ్ఛ ఆటోలో తన ముగ్గురు పిల్లలను వెంట తీసుకెళ్లారు. మంగళవారం రాత్రి భారీ గాలులకు కుంట్లూర్ సన్ రైజ్ కాలనీ రోడ్డు 3లో విద్యుత్ తీగ తెగిపడింది. దీన్ని గమనించిన ఆమె సమీపంలోని భవన నిర్మాణ కార్మికులను పిలవడానికి వెళ్లారు. ఈలోపు ఆటో దిగిన ఆమె కుమారుడు శివశంకర్ (5) విద్యుత్ తీగ తగలి విద్యుత్ షాక్ తో చనిపోయాడు. అటు, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ కు చెందిన షేక్ పర్వేజ్ (40) వర్షంలో తన పంక్చర్ దుకాణం బయట ట్యూబ్ లైట్ తీస్తుండగా విద్యుత్ షాక్ గురై ప్రాణాలు కోల్పోయాడు. అలాగే, చందానగర్ లోని గంగారంలో బీహార్ కు చెందిన దమేంద్ర కుమార్ యాదవ్ (33) తాను పని చేసే టీ బండిని విద్యుత్ స్తంభానికి గొలుసుతో కడుతుండగా.. విద్యుత్ షాక్ కు గురై మృతి చెందాడు. అటు, మూసారాంబాగ్ మెట్రో స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (45) మంగళవారం రాత్రి వర్షానికి జారి పడి ప్రాణాలు కోల్పోయాడు.

# జూన్ 1వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం

## – ప్రవేశాల షెడ్యూల్ ప్రకటించిన ఇంటర్మీడియట్ బోర్డు

హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జూ నియర్ కళాశాలల్లో 2024 –25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ బోర్డు ప్రవేశాల షెడ్యూల్ ప్రకటించింది. జూన్ 1వ తేదీ నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభించాలని బోర్డు ఆదేశించింది. ఇంటర్నెట్ మార్కుల మెమోల ఆధారంగా ప్రొవిజనల్ అడ్మిషన్లు చేయాలని పదో తరగతి ఒరిజినల్ సర్టిఫికెట్‌లు సమర్పించిన తర్వాత అడ్మిషన్లు ఖరారు చేయాలని తెలిపింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలలో ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 10 శాతం, బిసిలకు 29 శాతం, వికలాంగులకు 5 శాతం, ఎన్‌సిసి, స్పోర్ట్ కోటాకి 5 శాతం, ఎక్స్ సర్వీస్ మెన్ కోటా 3 శాతం, ఇడబ్ల్యుఎస్‌కి 10 శాతం సీట్లు, మహిళలకు 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నట్లు ఇంటర్ బోర్డ్ వెల్లడించింది. ఈ మేరకు ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు అడ్మిషన్ల ప్రక్రియ కోసం తగిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఇంటర్ బోర్డు గుర్తింపు ఉన్న కళాశాలల్లో మాత్రమే ప్రవేశాలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు బోర్డు సూచించింది. ఇంటర్ బోర్డు గుర్తింపు ఉన్న జూనియర్ కాలేజీల వివరాలు లి లి లి . జీ ఇ జీ ట బి బ ఎ తి వ . ఇ ణ ణ . ణ నీ ల . తి ని , లిలిలి.బిబఎతివ.ఇణణ.ణనీల.తిని వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నాయని తెలిపింది. విద్యార్థులు, తల్లిదండ్రులు వెబ్‌సైట్‌లో కళాశాలకు గుర్తింపు ఉందా..? లేదా..? అన్న విషయాన్ని నిర్ధారించుకున్న తర్వాతనే ప్రవేశాలు పొందాలని సూచించింది.కాగా ఈ నెల 9 నుంచి జూన్ 30వ తేదీ వరకు తొలివిడత అడ్మిషన్లు చేపట్టాలని తెలిపింది. ఈ నెల 9 నుంచి 31 వరకు దరఖాస్తులు ఫారాలు చేయనున్నట్లు పేర్కొన్నది. ప్రభు త్వ, ప్రైవేట్ ఎయిడెడ్, అన్ ? ఎయిడెడ్, కో –ఆపరేటివ్, టిఎస్ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, ట్రై బల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్, మైనారిటీ, కెజిబివి, టిఎస్ మోడల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు ప్రారంభించాలని వెల్లడించింది.

# 1000 దాటేసిన సిక్సర్లు

హైదరాబాద్, మే 10: ఐపీఎల్ 17వ సీజన్లో హైదరాబాద్ జట్టు అరుదైన ఘనతను సృష్టించుకుంది.లక్నో, హైదరాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ లో 1000 సిక్సర్ ల మార్క్ దాటింది. దీంతో ఈ సరికొత్త రికార్డుకు హైదరాబాద్ ఉప్పల్ మైదానం వేదికయింది.. వాస్తవానికి ఈ సీజన్లో ఆటగాళ్లు దూకుడుగా ఆడుతున్నారు.. ఆకాశమే హద్దుగా చెలరేగిపోతున్నారు. ఫోర్లు, సిక్స్ లు ఎడా పెడా కొడుతూ బౌలర్లకు నిద్రలేని రాత్రులు పరిచయం చేస్తున్నారు.. హైదరాబాద్ జట్టయితే ఈ ఐపీఎల్ లో ఏకంగా ముంబై పై 277, బెంగళూరు పై 287 రన్స్ చేసి సరికొత్త రికార్డు సృష్టించింది. ఐపీఎల్ చరిత్రలో ఏ ప్రకారం చూసుకున్నా 17వ సీజన్ అన్ని రికార్డులను బద్దలు కొడుతోంది.ఈ సీజన్లో 13,079 బంతుల్లో బ్యాటర్లు 1000 సిక్సర్లు కొట్టారు. అంతకుముందు 2022లో 1000 సిక్సర్లు కొట్టేందుకు బ్యాటర్లు 16,269 బంతులను వినియోగించారు. 2023లో 15,390 బంతులను ఎదుర్కొని 1000 సిక్సర్లు బాదారు. ఇప్పటివరకు 57 మ్యాచులు పూర్తయ్యాయి. ఇంకా కొన్ని మ్యాచ్లు మిగిలి ఉన్న నేపథ్యంలో బ్యాటర్లు మరెన్నో సిక్సర్లు కొట్టే అవకాశం ఉంది. ఈ సిక్సర్ల జాబితాలో హైదరాబాద్ జట్టు అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు ఆటగాళ్లు దూకుడుగా బ్యాటింగ్ చేస్తుండడంతో ప్రత్యర్థి బౌలర్లకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఫోర్లకంటే సిక్సర్లే ఎక్కువగా కొడుతుండడంతో హైదరాబాద్ జట్టు ఆటగాళ్లు ఈసారి ప్రత్యేకంగా నిలుస్తున్నారు.హైదరాబాద్ జట్టు ఈసారి 138 సిక్స్ లు కొట్టింది. ఢిల్లీ జట్టు 120 సిక్స్ లు బాదింది. కోల్ కతా 116, ముంబై ఇండియన్స్ 116, బెంగళూరు 114, పంజాబ్ 95, రాజస్థాన్ 94, చెన్నై 82, లక్నో 77, గుజరాత్ 54 సిక్స్ లు కొట్టి తమ సత్తా చాటారు. అయితే ఈసారి ఆటగాళ్లు దూకుడుగా ఆడటం వల్లే ఈ స్థాయిలో సిక్స్ లు నమోదవుతున్నాయని మాజీ క్రికెటర్లు చెబుతున్నారు. అయితే ఈసారి ఇంకా కొన్ని మ్యాచ్లు మిగిలి ఉన్న నేపథ్యంలో.. మరిన్ని సిక్స్ లు నమోదవుతాయని తెలుస్తోంది. బ్యాటర్లు అంతకంతకు దూకుడుగా ఆడుతున్న నేపథ్యంలో సరికొత్త రికార్డులు నెలకొల్పే అవకాశం ఉంది.

# అసద్ కు నవనీత్ కౌంటర్

హైదరాబాద్, మే10: వనీత్ కౌర్ గా తెలుగు ప్రజలకు పరిచయమైన లీడర్ నవనీత్ రాణా. తెలుగు సినిమాల్లో హీరోయిన్ గా చేసి మహారాష్ట్ర రాజకీయ నేతను పెళ్లి చేసుకున్నారు. తర్వాత తాను రాజకీయాల్లోకి వచ్చారు. ఈ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. బీజేపీ తరపున ప్రచారం చెయడానికి తెలంగాణకు వచ్చారు. ఈ క్రమంలో ఎన్నికల ప్రచారంలో భాగంగాలో బీజేపీ నేత నవనీత్‌రాణా.. ఎంఐఎం పార్టీపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. 2013లో అక్బరుద్దీన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. 15 నిమిషాలు పోలీసులు తప్పుకుంటే 100 కోట్ల మంది హిందువుల అంతు చూస్తామని హెచ్చరించారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేత నవనీత్ రానా కౌంటరిచ్చారు. 15 నిమిషాలు కాదు? కేవలం 15 సెకన్లలో అడ్రస్ లేకుండా చేస్తామని హెచ్చరించారు. మీరు ఎక్కడి నుంచి వచ్చారో? మళ్లీ ఎక్కడికి వెళ్తారో మీకే తెలియదంటూ వ్యాఖ్యానించారు. హైద్రాబాద్ మరో పాకిస్థాన్ కాకుండా బిజెపి అభ్యర్థి మాధవి లత అడ్డుకుటుందని ఎంపీ నవనీత్ కౌర్ తెలిపారు. నవనీత్ రాణా వ్యాఖ్యలు సోషల్ మీడియలో వైరల్ అయ్యాయి. నవనీత్ రానా వ్యాఖ్యలకు అసదుద్దీన్ కౌంటర్ ఇచ్చారు. మీరు 15 సెకండ్లు అడుగుతున్నారు... ప్రధాని మోదీని ఒకటి అడుగుతున్నాను, గంట సమయం ఇవ్వండని కోరుతున్నానన్నారు. అప్పుడు మీలో ఎంత మానవత్వం మిగిలి ఉందో తెలుసుకోవాలనుకుంటున్నామన్నారు. ఎవరు భయపడేవాళ్లు ఉన్నారు? మేం సిద్ధంగానే ఉన్నామని వ్యాఖ్యానించారు. ప్రధాని మీవారు... ప్రభుత్వం మీది... ఆరెస్సెస్ మీది... ఎవరు ఆపుతున్నారు... ఎక్కడకు రమ్మంటే అక్కడకు వస్తానని సవాల్ చేశారు. ఏం చేస్తారో చేయండన్నారు. మజ్లిస్ కు మహారాష్ట్రలోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. నలుగురు ఎమ్మెల్యేలు, ఓ ఎంపీ కూడా ఉన్నారు. అక్కడ ముస్లిం వర్గాల బలం మజ్లిస్ కు ఉండటంతో.. బీజేపీలో చేరిన నవనీత్ రాణా హైదరాబాద్ లో మజ్లిస్ ను టార్గెట్ చేసుకున్నట్లుగా కనిపిస్తోంది. అదే సమయంలో హైదరాబాద్‌లో బీజేపీ అభ్యర్థి మాధవీ లత .. గట్టి పోటీ ఇస్తున్నారు.

# అదిలాబాద్ లో సిట్టింగ్ నిలబడేనా...?

అదిలాబాద్, : ఆదిలాబాద్ ఎంపి సీటు మూడు పార్టీలకు అగ్ని పరీక్షగానే మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో నాలుగు బీజేపీ, రెండు బీఆర్ఎస్, ఒక సీటును కాంగ్రెస్ ను గెలుచుకుంది. ఇలా మిశ్రమ ఫలితాలు వచ్చిన నేపథ్యంలో గెలుపు లెక్కలు పక్కనపెడితే ఏడు నియోజకవర్గాల్లో కలిపి మెజార్టీని మాత్రం అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీనే సాధించింది. కేవలం బోథ్ , ఆసిఫాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకున్న బీఆర్ఎస్ 46,5476 ఓట్లను సాధించుకుని అగ్ర భాగాన నిలిచింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలు కలిపి 15,17,681 ఓట్లకుగాను 13,07,563 ఓట్లు పోలవగా.. ఏకంగా నాలుగు స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ మొత్తం ఓట్లలో 4,48,961 ఓట్లను తన ఖాతాలో వేసుకుంది. ఇక కేవలం ఒకే ఒక్క ఎమ్మెల్యే స్థానంతో సరిపెట్టుకున్న కాంగ్రెస్ పార్లమెంట్ పరిధిలో 2,52,286 ఓట్లను కైవసం చేసుకుని మూడవ స్థానానికి పరిమితం అయింది. అయితే మారిన రాజకీయ పరిణామాలతో బీఆర్ఎస్ నుండి పెద్ద ఎత్తున కాంగ్రెస్ లోకి చేరికలు సాగడంతో క్యాడర్ బలం, బలగం పెరిగి గంప గుత్తగా ఓటు బ్యాంకును కైవసం చేసుకోగలిగింది హస్తం పార్టీ. అయితే బలం పెరిగినా అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన ఖానాపూర్ నియోజకవర్గంలో మాత్రం ప్రతికూల ఫలితాలు కనిపిస్తున్నట్టుగా తెలుస్తోంది. దీంతో ఇంట గెలిచి రచ్చ గెలవాల్సిన పరిస్థితి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఎదురవుతోంది.రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీ కావడం పార్లమెంట్ పరిధిలోనే ఏకైక అధికార పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే నియోజక వర్గం కూడా ఖానాపూర్ కావడంతో ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న వెడ్మ బొజ్జుపై భారం ఎక్కువగానే ఉన్నట్టు తెలుస్తోంది. ఇక్కడ అసెంబ్లీ ఎన్నికల్లో మూడు పార్టీలు నువ్వా నేనా అన్నట్టుగా తలపడగా.. కాంగ్రెస్ 58,870 ఓట్ల సాధించి.. ప్రత్యర్థి పార్టీ బీఆర్ఎస్ పై 4,702 ఓట్ల తేడాతో విజయం సాధించింది. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో ఆ మెజార్టీ కాంగ్రెస్ ఖాతాలోనే ఉంటుందా లేక పక్క పార్టీకి వెలుతుందా అన్న టెన్షన్ ఎమ్మెల్యే వర్గంలో ఉంది. ఈ నియోజకవర్గంలో ఆపరేషన్ ఆకర్ష్ పెద్ద ఎత్తున కొనసాగగా.. బీజేపీ సైతం ఈ నియోజక వర్గంపై ప్రత్యేక ఫోకస్ పెట్టడంతో ఖానాపూర్ లో మెజార్టీని పునరావృతం చేసేందుకు సిట్టింగ్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తీవ్రంగానే శ్రమించక తప్పడం లేదు. అయితే పార్లమెంట్ పరిధిలో గెలిచిన ఏకైక ఎమ్మెల్యే కావడంతో మిగిలిన నియోజక వర్గాల్లోను ప్రచారం చేయాల్సి రావడంతో సొంత నియోజకవర్గానికి ఎక్కువ సమయం కేటాయించలేక పోవడంతో ప్రతికూల పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది.ఇక ఇద్దరు ఎమ్మెల్యేలను గెలుచుకున్న బీఆర్ఎస్.. ఇటు హస్తం పార్టీ ఆపరేషన్ ఆకర్ష్ తో లీడర్లను కాపాడుకోవడంతో పాటు.. అటు కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం కత్తిమీద సాములా మారింది. ఆదివాసీ నియోజకవర్గాలైన ఆసిఫాబాద్, బోథ్ లో బీఆర్ఎస్ విజయం సాధించినా.. ఆసిఫాబాద్ లో కాంగ్రెస్ జెట్ స్పీడ్ తో పుంజుకో వడం.. ఇటు బోథ్ లో బీజేపీ చాపకింద నీరులా విస్తరించడంతో రెండు నియోజకవర్గాల్లో ప్రతికూల ఫలితాలనే ఎదుర్కొంటున్నట్టు తెలుస్తోంది. బోథ్ లో కోవ లక్ష్మి 83,036 ఓట్లను సాధించి 22,798 వేల భారీ ఆధిక్యంతో కాంగ్రెస్ పై విజయం సాధించగా.. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలతో కీలక నేతలు పార్టీని వీడి కాంగ్రెస్ గూటికి చేరడం మైనస్ గానే మారింది. అయితే బీఆర్ఎస్ ఎంపి అభ్యర్థి సొంత నియోజక వర్గం కావడం.. ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై పాజిటివ్ టాక్ తో బీఆర్ఎస్ ఆసిఫాబాద్ నియోజకవర్గ మెజార్టీని కాపాడుకునే అవకాశమే ఉన్నట్టుగా తెలుస్తోంది. ఇటు బోథ్ లోను బీఆర్ఎస్ గెలుపొందగా.. మారిన రాజకీయ పరిణామాలతో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ తన మెజార్టీని పార్లమెంట్ ఎన్నికల్లోను కంటిన్యూ చేసేందుకు తీవ్రంగా చెమటోడ్చక తప్పని పరిస్థితే ఉన్నట్టుగా తెలుస్తోంది. అనిల్ జాదవ్ 76,792 ఓట్లు సాధించి సమీప అభ్యర్థి సోయం బాపురావు బీజేపీపై 22,800 ఓట్ల మెజర్టీని సాదించగా.. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో ఈ మెజార్టీని కాపాడుకోవడం కత్తి మీద సాములాగే మారిందని తెలుస్తోంది. ఈ నియోజక వర్గంపై ప్రత్యేక ఫోకస్ పెట్టిన కాంగ్రెస్ , బీజేపీలు పోటాపోటీ ఆపరేషన్ ఆకర్ష్ తో బీఆర్ఎస్ కు గడ్డుకాలం ఎదురవగా.. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాత్రం తీవ్రంగా శ్రమిస్తుండటం కలిసొచ్చే అంశం.అటు నాలుగు స్థానాలను గెలుచుకున్న బీజేపీ.. పార్లమెంట్ సిట్టింగ్ సీటును కాపాడుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి నిలవాలని విశ్వ ప్రయత్నాలే చేస్తోంది. అయితే ఇంట గెలిచి రచ్చ గెలవాల్సిన పరిస్థితులు బీజేపీ ఎమ్మెల్యే లకే ఎక్కువగా ఉన్నట్టుగా తెలుస్తోంది. భారీ మెజార్టీతో విజయం సాదించిన నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి బీజెఎల్పీగా కొనసాగుతుండటంతో ఈ పార్లమెంట్ లో బీజేపీ గెలుపు బాధ్యతలు అదనపు భారం మహేశ్వర్ రెడ్డి మోయక తప్పడం లేదు. ఈ నియోజక వర్గంలో 10,6400 ఓట్లు సాధించి ఏకంగా 50,703 ఓట్లతో మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ( బీఆర్ఎస్ ) మట్టికరిపించడం బీజేపీకి బూస్ట్ నిచ్చింది. తాజా పార్లమెంట్ ఎన్నికలను టార్గెట్ గా తీసుకున్న కాంగ్రెస్ నిర్మల్ జిల్లా మీద ప్రత్యేకఫోకస్ పెట్టగా.. నిర్మల్ ను కాంగ్రెస్ కు అడ్డాగా మార్చేందుకు భారీ ఆపరేషన్ ఆకర్ష్ ను కంటిన్యూ చేస్తోంది కాంగ్రెస్. అందులో భాగంగానే మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని పార్టీలోకి చేర్చుకోవడంతో బీఆర్ఎస్ కు ఈ నియోజకవర్గంలో పెద్ద షాక్ తగిలినట్లైంది. పార్లమెంట్ లో బీఆర్ఎస్ సాధించిన 55,697 ఓట్లలో సగానికిపైగా పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కు పడే అవకాశమే ఉన్నట్టుగా తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 28,642 ఓట్లను సాధించుకోగలిగిన కాంగ్రెస్.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో భారీగా పుంజుకుని బీజేపీకి సవాల్ విసిరే అవకాశం ఉంది. అయితే నిర్మల్ నియోజవర్గంలో బీజేపీ వైపు ఇక్కడి ప్రజానికం నిలవనుండటంతో మహేశ్వర్ రెడ్డి ఇంట గెలిచి రచ్చ గెలిచేందుకు పక్కా వ్యూహాలతో ముందుకు దూసుకెళుతున్నట్టుగానే తెలుస్తోంది.ఇక ఆదిలాబాద్ ను కాషాయ అడ్డాగా మార్చుకున్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లో ఇదే స్థాయి ఫలితాలను పునరావృతం చేయాలని చూస్తోంది. ఇక్కడ కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ కు తెరలేపినా.. అదే స్థాయిలో అసమ్మతి నివురు గప్పిన నిప్పులా సాగుతుండటంతో కలిసొచ్చే కాలానికి నడిచి రాని మెజార్టీగానే ఈ నియోజకవర్గం కనిపిస్తోంది. ఈ నియోజక వర్గంలో బీజేపీ 67,608 ఓట్లను సాధించడంతో పాయల్ శంకర్ తొలిసారిగా అధ్యక్షా అనే అవకాశం దక్కించుకోగా.. రాజకీయచతురతతో సిట్టింగ్ ఎంపిని కాదని బీజేపీ అభ్యర్థిగా గోడెం నగేష్ కు ఎంపి టికెట్ దక్కడంలో చక్రం తిప్పారన్న పేరుంది. దీంతో పార్లమెంట్ పరిధిలోని మిగిలిన నియోజకవర్గాల్లోను తన బలం పెంచుకోవాలని పాయల్ ప్రయత్నిస్తుంటే.. వర్గపోరు ఆయనను వెనక్కి లాగుతున్నట్టు తెలుస్తోంది. దీంతో మొదట ఇంట గెలవాల్సిన పరిస్థితి పాయల్ శంకర్ కు అత్యవసరంగా మారినట్టు తెలుస్తోంది. ఇప్పటికైతే బీజేపీ అనుబంధ సంఘాల బలం కలిసొచ్చే అంశంగానే కనిపిస్తోంది. కానీ బీఆర్ఎస్ ఈ నియోజక వర్గంలో బలపడినా.. ఆపరేషన్ ఆకర్ష్ ఫలితం కాంగ్రెస్ కు దక్కినా బీజేపీకి అసెంబ్లీ తరహా మెజార్టీ దక్కడం కష్టమే అన్న టాక్ కూడా లేకపోలేదు.ఇక సిర్పూర్ , ముథోల్ నియోజక వర్గాలు సైతం బీజేపీకి కంచుకోటగా మారగా.. ఈ రెండు నియోజక వర్గాల ఎమ్మెల్యేలకు మెజార్టీని కాపాడుకోవడం కత్తిమీద సాములాగే మారింది. ముథోల్ లో బీజేపీకి ఇప్పటికిప్పుడు వచ్చిన డోకా ఏం లేదన్న ప్రచారం ఉన్నా.. అధికార పార్టీ మాత్రం ఆపరేషన్ ఆకర్ష్ తో అన్నంత పని చేసేందుకు సిద్దమవడం కూడా ముథోల్ లో ఎమ్మెల్యే రామరావు పటేల్ కు కష్టకాలంగానే మారిందని తెలుస్తోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఏకంగా 98,252 ఓట్లతో 23,999 ఓట్ల తేడాతో భారీ విజయాన్ని దక్కించుకున్న బీజేపీ పార్లమెంట్ ఎన్నికల్లోను ఆ మెజార్టీని దక్కించుకుంటుందా లేదా చూడాలి. ఇక సిర్పూర్ లోను అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ హవా కొనసాగగా.. మారిన రాజకీయ పరిణామాలతో కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్ తో ఇక్కడ బీఆర్ఎస్ ఖాళీ అయింది. మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కాంగ్రెస్ లోకి చేరడంతో హస్తం పార్టీ రెట్టింపు ఉత్సహంతో కనిపిస్తుండగా.. బీజేపీ సంప్రదాయ ఓటును నమ్ముకుని సాగుతోంది.

ఇక్కడ బీజేపీ 63,702 ఓట్లను సాధించి సమీప అభ్యర్థి బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కోనేరుకోనప్పపై కేవలం 3,088 ఓట్లతో గట్టెక్కగా.. తాజా పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటాలంటే సిర్పూర్ లో మెజార్టీ కీలకం కావడంతో ఇంట గెలవాల్సిన అత్యవసర పరిస్థితి ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు ముందుంది. ఆదిలాబాద్ పార్లమెంట్ సీటును ఏ పార్టీ సాదించినా సొంత నియోజకవర్గంలో మెజార్టీని మాత్రం సిట్టింగ్ ఎమ్మెల్యేలు సాధించక తప్పని పరిస్థితి. సో.. అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీని సాధించుకున్న తీరుగానే.. నాలుగు రోజుల్లో రానున్న ఓట్ల పండుగలో తిరిగిసత్తా చాటి.. తమ పార్టీకి వెన్నుదన్నుగా నిలుస్తారో.. లేక ప్రతికూల పరిస్థితులతో వెనకబడిపోతారో చూడాలి.

# పాలమూరు-రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలే

హైదరాబాద్: మల్కాజ్ గిరి పార్లమెంట్ పరిధిలోని కంటోన్మెంట్, మల్కాజ్ గిరిలో యూత్ మీటింగ్ కు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హజరయ్యారు. కేటీఆర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలు కదా? బీఆర్ఎస్ ఎందుకు ఉండాలే అని కొందరు అంటున్నారు. 2001 లో కేసీఆర్ గారు టీఆర్ఎస్ పార్టీ పెట్టినప్పుడు పార్లమెంట్ లో మనకు బలం ఉండాలే అన్నారు. అప్పుడు కూడా చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డిలు అవహేళన చేసే విధంగా మాట్లాడారు. 2004 లో మనం ఐదుగురు ఎంపీలు గెలిచినాం. ఆ ఐదుగురితోనే కేసీఆర్ ఢిల్లీకి పోయిండని అన్నారు. 32 పార్టీలను ఒప్పించి, మెప్పించి తెలంగాణను సాధించింది కేసీఆర్. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు రాహుల్ గాంధీ, మోడీ ఉస్కో అంటే ఉస్కో, డిస్కో అంటే డిస్కో అంటారు. రాహుల్ గాంధీని, మోడీని ఎదురించే దమ్ము కాంగ్రెస్, బీజేపీ ఎంపీలకు లేదు.జూన్ 2 తర్వాత హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని బీజేపీ కుట్ర చేస్తోంది. స్కై వే కట్టటం కోసం పదేళ్లు మిలిటరీ భూములు ఇవ్వమంటే కంటోన్మెంట్ లో ఇయ్యలే. కేంద్రపాలిత ప్రాంతం అయితే మన జుట్టు తీసుకొనిపోయి ఢిల్లీ వాడి చేతిలో పెట్టినట్లయితది. కేంద్రపాలిత ప్రాంతమైతే హైదరాబాద్ అభివృద్ధి ఆగిపోతుంది. ఈ కుట్రను అడ్డుకోవాలంటే కచ్చితంగా బీఆర్ఎస్ ఎంపీలు లోక్ సభలో ఉండాలె. ఢిల్లీలో ఉన్నది బీజేపీ ది సవతి తల్లి లాంటి వ్యవహారం. వాళ్లు మనకు అడగనిదే ఏదీ చేయరు. గల్లా పట్టి నిలదీసే ధైర్యం ఉండాలంటే మన కేసీఆర్ సైనికులు పార్లమెంట్ లో ఉండాలె. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లు రద్దు చేసే కుట్ర చేస్తోంది బీజేపీ. అవసరమైతే రాజ్యాంగాన్ని కూడా మార్చేయాలని ప్రయత్నం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎక్కడ ఉంటే అక్కడ బీజేపోళు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అలకగా పడగొట్టారు. కానీ కేసీఆర్, మమతా బెనర్జీ, హేమంత్ సోరెన్, స్టాలిన్, కేజ్రీవాల్ గారి ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేసి విఫలమైందని అన్నారు. గట్టి లీడర్లు ఉన్న చోట బీజేపీ ఆటలు సాగలేదు. కాంగ్రెస్ కు మాత్రం బీజేపీని అడ్డుకోవటం చేతకాలేదు. మోడీతో కొట్లాడే ధైర్యం రాహుల్ గాంధీకి లేదు. ప్రాంతీయ శక్తులే బలంగా మోడీతో కొట్లాడగలవు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు జనరేటర్లు, ఇన్వెర్టర్లు, క్యాండిల్ లైట్లు, టార్చిలైట్, పవర్ బ్యాంక్, ఛార్జింగ్ బల్బ్ లు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ వస్తే ఈ పరిస్థితి ఉంటది ముందే చెప్పినం. మీరు కాంగ్రెస్ హామీలను నమ్మలేదు. కానీ జిల్లాల్లో, గ్రామాల్లో ప్రజలు ఆ పార్టీ నమ్మారు. కేసీఆర్ ఉన్నప్పుడే బాగుండే అని అనుకునేటోళ్లకు ఒక ఉపాయం చెబుతా. ??మీరు 10–12 సీట్లు ఇవ్వండి. 6 నెలల్లోనే కేసీఆర్ రాష్ట్ర రాజకీయాలను శాసిస్తారు. రేవంత్ రెడ్డి చాలా మాటలు చెప్పాడు. అరచేతిలో వైకుంఠం చూపించిండు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, బోనస్, 2 లక్షల ఉద్యోగాలు, తులం బంగారం, స్కూటీలు, మహిళలకు రూ. 2500, పెద్ద మనుషులకు 4 వేలు అని చెప్పిండు. చెప్పిదాంట్లో ఒక్కటైనా ఈ రేవంత్ రెడ్డి అమలు చేసిండా? 5 నెలల్లో రేవంత్ రెడ్డి చేసిందేమిటంటే చిల్లర మాటలు, ఉద్దెర పనులు. లంకె బిందెలు ఉంటాయనుకొని వచ్చినా అంటాడు. లంకెబిందెల కోసం దొంగలు కదా వెతికేది? పేగులు మెడలు వేసుకుంట అంటాడు. జేబుల కత్తెర పెట్టుకుంటా అంటాడు. సీఎం చేసే పనులేనా? మన తెలంగాణ పరిస్థితి పిచ్చోని చేతిలో రాయిలా తయారైంది. కరెంట్, నీళ్లు ఇచ్చుడు చేతనైతలేదు. కానీ విలన్లు చెప్పినట్టు డైలాగులు చెబుతుండు. హైదరాబాద్ లో ఉన్న కంపెనీలను కాపాడుకునే చేతనైతలే. ఇంకా కొత్త కంపెనీలు వచ్చే పరిస్థితే లేదు. పరిపాలన చేతకాని వాళ్లకు అవకాశం ఇస్తే నష్టపోయేది మనమే. పదేళ్లు ప్రధానిగా పనిచేసిన వ్యక్తి హైదరాబాద్ ఒక్క పనిచేసిన అని చెప్పగలడా? ఒక్క బడి కట్టలే, గుడి కట్టలే. ఎందుకు ఓటు వేయాలంటే జై శ్రీరామ్ అంటాడు. 2014లో ఏమన్నాడు. ఇంటింటికి రూ. 15 లక్షలు అన్నాడు. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం డబుల్ చేస్తా అని చెప్పిండు.బుల్లెట్ రైళ్లు, ఇండియాను 5 టిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అని కూడా అన్నాడు. ఒక్కటైనా అయ్యిందా? ఈ ప్రధాని మోడీ ధరలు కూడా తగ్గిస్తా అన్నాడు. కానీ పప్పు, ఉప్పు, చింతపండు అన్ని పిరం చేసిండు. పెట్రోల్ ధరలు, డిజీల్ ధరలు పెంచటం కారణంగా ఈ ధరలన్నీపెరిగాయి. ??మోడీ వచ్చిన నాడు ముడి చమురు వంద డాలర్లకు బ్యారెల్. ఇప్పుడు ముడి చమురు బ్యారెల్ కు 84 డాలర్లు. మరి తగ్గాల్సిన ధరలు ఎందుకు తగ్గలేదు. రూ. 70 పెట్రోల్ రూ. 110 అయ్యింది. పెట్రోల్, డిజీల్ మీద రాష్ట్రాలకు వాటా ఇవ్వకుండా రూ. 30 లక్షల కోట్లు వసూలు చేసిండు. ఈ పైసలతో జాతీయ రహదారులు కట్టినా అంటాడు. మరి టోల్ ఎందుకు వసూల్ చేస్తున్నా వంటే చెప్పడు. మన ముక్కుపిండి వసూలు చేసిన రూ. 30 లక్షల కోట్లలో రూ. 14 లక్షల కోట్లు అదానీ, అంబానీలకు రుణమాఫీ చేసిండు. నేను చెప్పింది అబద్ధమని నిరూపిస్తే నా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి...రాజకీయాల నుంచి తప్పుకుంటా. భారత దేశంలో ఏం జరుగుతుందో మీ యువత తెలుసుకోవాలె.ఇండియాకు ఏదో జరుగుతుం దని... హిందూమతమని, పాకిస్తాన్ అంటూ విద్వేషాలు పెంచి రాజకీయాలు చేయటమే బీజేపీ పని. పాలమూరు– రంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వలే. విభజన హామీలు ఒక్కటి కూడా చేయలే. ఎందుకు మనం బీజేపీకి ఓటు వేయాలో ఆలోచించాలె. అడిగితే గుడి కట్టినం అంటారు. గుడిని మనం కూడా కట్టినం. కేసీఆర్ గారు యాదాద్రిని కట్టలేదా? కానీ మతం పేరుతో ఎప్పుడైనా రాజకీయా లు చేశారా? రాముడు కూడా రాజధర్మం పాటించమని చెప్పాడు. పరిపాలకుడు ఎవరినైనా ఒకే విధంగా చూడాలి. కానీ హైదరాబాద్ కు వరదలు వస్తే రూపాయ్ ఇయ్యాడు మోడీ. అదే గుజరాత్ కు వరదలు వస్తే వెయ్యి కోట్లు ఇస్తాడు. ఇదే నా రాజధర్మం? దయచేసి లాంగ్ వీకెండ్ ఉందని యువత ఓటు వేయకుండా ఉండొద్దు. మీరు ఓటు వేయకపోతే మీకు ఇష్టం లేని లంగ, దొంగ నాయకులు రాజ్యమేలుతారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు నాన్ లోకల్. రాగిడి లక్ష్మారెడ్డి గారు మాత్రం మీకు ఎప్పుడు అందుబాటులో ఉంటారు. రాగిడి లక్ష్మారెడ్డి ని భారీ మెజార్టీతో గెలిపించాలని మీ అందరినీ కోరుతున్నానని అన్నారు.

# ఊరెళ్తున్న మహా నగరం....

హైదరాబాద్: ఎన్నికలకు మరో 3 రోజుల సమయం మాత్రమే ఉండడంతో నగర ప్రజలు తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. పిల్లలకు వేసవి సెలవులు, ఇటు ఎన్నికలు ఉండడంతో వారం రోజుల ముందే ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారు. ఈనెల 13న తెలంగాణలో లోక్ సభ ఎన్నికలకు పోలింగ్...... ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఏపీకి చెందిన నగరవాసులకు హైదరాబాద్ తో పాటు తమ సొంత గ్రామాల్లో కూడా ఓటు హక్కు ఉండడంతో.... గ్రామాల్లో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం అక్కడ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారుహైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే ఆర్టీసీ బస్సులకు, రైళ్లకు భారీ డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ ట్రైన్స్ ఇప్పటికే రద్దీ పెరుగుతుంది. ఎండాకాలం కావడంతో ఏసీ కోచ్ లలో రిజర్వేషన్లు కూడా త్వరగా ముగుస్తున్నాయి. ఇటు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినప్పటికీ......గడిచిన రెండు రోజుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు. సాధారణంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 1.85 లక్షలు రాకపోకలు సాగిస్తే.....గత కొద్ది రోజులుగా ఆ సంఖ్య దాదాపు 3 లక్షలకు చేరిందని అధికారులు అంటున్నారు. అయితే ఈసారి సాఫ్ట్వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, వాచ్ మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా పని చేసే లక్షలాది మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. ఇదిలా ఉంటే హైదరాబాద్ లో స్థిరపడ్డ ఏపీ ప్రజలను తమ సొంతూళ్లకు తరలించేందుకు రాజకీయ పార్టీలు ప్రైవేట్ బస్సులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాయట.హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సైతం భారీగా డిమాండ్ పెరిగింది. సుమారు 1500 ఆర్టీసీ బస్సులు ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులను నడిపేందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆలోచిస్తుంది. ఇటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సైతం హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్యను పెంచేందుకు యోచిస్తోంది. ఆర్టీసీ బస్సుల సంగతి ఇలా ఉంచితే.....అటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు సైతం విపరీతంగా డిమాండ్ పెరుగుతుంది. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట.

ప్రైవేట్ బస్సులో బుకింగ్స్ కూడా పెరిగిపోయాయి. సాధారణం కంటే నగరంలో 1000 ప్రైవేట్ బస్సులు అదనంగా ఏపీకి రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీ నగర్, సికింద్రబాద్, కేపీహెచ్బీ నుంచి అధిక బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి

# రూసో గన్ సెలబ్రేషన్ ఫోజు.. ఆ స్టైయిల్‌లోనే సెండాఫ్ ఇచ్చిన కోహ్లీ

ధర్మశాల: పంజాబ్ కింగ్స్ , రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు జట్ల మధ్య జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో ఆసక్తికర ఘటనలు చోటుచేసుకు న్నాయి. ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 60 రన్స్ తేడాతో నెగ్గింది. దీంట్లో విరాట్ కోహ్లీ మ్యాచ్ విన్నింగ్ ఆట ఆడాడు. అతను 47 బంతుల్లో 92 రన్స్ చేశాడు. ఇక ఫీల్డింగ్‌లోనూ చురుగ్గా కనిపించాడు. 242 రన్స్ టార్గెట్‌తో చేజింగ్‌కు దిగిన పంజాబ్ క్రమంగా వికెట్లను కోల్పోయింది. అయితే వన్‌డౌన్ బ్యాటర్ రిలే రూసో ధాటిగా ఆడాడు. అతను 61 రన్స్ చేసి ఔటయ్యాడు. అయితే హాఫ్ సెంచరీ కొట్టిన సమయంలో.. రిలే రూసో సెలబ్రేట్ చేస్తుకున్నాడు. మైదానంలో గన్ సెల్యూట్ ఇస్తున్నట్లు ఫోజు పెట్టి సంబరం జరుపుకున్నాడు. సౌతాఫ్రికా బ్యాటర్ రూసో ఔటైన తర్వాత ఆర్సీబీ ప్లేయర్ కోహ్లీ ఫుల్ సెలబ్రేట్ చేసుకున్నాడు. రూసోకు సెండాఫ్ ఇస్తూ కోహ్లీ కూడా గన్ ఫైరింగ్ ఫోజు ఇచ్చాడు.



శర్మ బౌలింగ్‌లో జాక్స్‌కు క్యాచ్ ఇచ్చి రూసో వెనుదిరిగాడు. 12 మ్యాచ్‌లు ఆడిన పంజాబ్ జట్టు.. 8 మ్యాచుల్లో ఓటమిపాలైంది. దీంతో టోర్నీ నుంచి ఆ జట్టు నిష్క్రమణకు గురైంది.

# రాహుల్ ద్రావిడ్ అవుట్- టీమిండియాకు కొత్త కోచ్

భారత క్రికెట్ జట్టు హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్.. ఇక మాజీ కావడం ఖాయంగా కనిపిస్తోంది. ఆయన స్థానంలో కొత్త కోచ్ కోసం బీసీసీఐ అన్వేషణ మొదలు పెట్టింది కూడా. టీ20 వరల్డ్ కప్ 2024 తరువాత దీనికి సంబంధించిన ఏర్పాట్లను మరింత ముమ్మరం చేయనుంది. ఐపీఎల్ సీజన్ ముగిసిన వెంటనే టీ20 వరల్డ్ కప్ 2024 టోర్నమెంట్ ఆడబోతోంది టీమిండియా. ఈ నెల 27వ తేదీన ఐపీఎల్ ఫైనల్స్ ముగిసిన వారం రోజుల తరువాత అంటే జూన్ 2వ తేదీన టీ20 వరల్డ్ కప్ 2024 టోర్నమెంట్ ఆరంభం కానుంది. 29వ తేదీ వరకు కొనసాగుతుంది. వెస్టిండీస్, అమెరికా.. సంయుక్తంగా ఈ మెగా ఈవెంట్‌ను నిర్వహిస్తోన్నాయి. ఈ రెండు దేశాలు కలిపి మొత్తంగా ఏడు స్టేడియాల్లో మ్యాచ్‌లు షెడ్యూల్ కానున్నాయి. తొలి సగం మ్యాచ్‌లు వెస్టిండీస్‌లోని ఆంటిగ్వా అండ్ బార్బుడా, బార్బడోస్, గయానా, సెయింట్ లూసియా, సెయింట్ విన్సెంట్, గ్రెనడైన్స్, ట్రినిడాడ్ అండ్ టొబాగోల్లో మ్యాచ్‌లు జరుగనున్నాయి.

మిగిలిన సగం మ్యాచ్‌లు- అమెరికాలోని డల్లాస్, ఫ్లోరిడా, న్యూయార్క్ స్టేడియాల్లో నిర్వహించనుంది ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్. ట్రినిడాడ్, గయానాల్లో రెండు సెమీ ఫైనల్స్, బార్బడోస్‌లో ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. భారత్ సహా అన్ని దేశాల క్రికెట్ బోర్డులు కూడా ఈ టీ20 వరల్డ్ కప్‌లో ఆడబోయే జట్లను ఇప్పటికే ప్రకటించాయి కూడా. ఐపీఎల్ 2024 సీజన్‌లో ప్లేఆఫ్స్, ఫైనల్స్ ఆడబోయే ఫ్రాంఛైజీల ప్లేయర్లు మినహా టీమిండియాకు ఎంపికైన మిగిలిన క్రికెటర్లు ఈ నెల 24వ తేదీన వెస్టిండీస్‌కు బయలుదేరే అవకాశం ఉంది.

దీని రిజల్ట్ ఎలా ఉన్నప్పటికీ- టీమిండియాకు కొత్త కోచ్ రావడం మాత్రం ఖాయమైనట్టే. ఈ వరల్డ్ కప్ ముగిసిన తరువాత కొత్త కోచ్



ఎంపిక ప్రక్రియను చేపట్టనుంది బీసీసీఐ. కొత్త కోచ్ కోసం త్వరలోనే దరఖాస్తులను ఆహ్వానించనుంది. దీనికోసం ఓ అడ్వర్టయిజ్‌మెంట్‌ను జారీ చేయనుంది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి జై షా ధృవీకరించారు. హెడ్ కోచ్‌గా రాహుల్ ద్రావిడ్ పదవీకాలం జూన్ వరకు కొనసాగుతుందని, ఆ తరువాత కొత్త కోచ్ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తామని, దీనికోసం యాడ్స్ ఇస్తామని అన్నారు. ఆసక్తి ఉంటే రాహుల్ ద్రావిడ్ కూడా దరఖాస్తు దాఖలు చేయొచ్చని చెప్పారు.

విదేశీ ఆటగాడిని హెడ్ కోచ్‌గా ఎంపిక చేసే అవకాశాలను జై షా కొట్టి పారేయట్లేదు. కోచ్‌గా ఎవరు ఉండాలి? ఫారిన్ ప్లేయర్‌ను తీసుకోవాలా? వద్దా అనేది ఇంకా నిర్ణయించలేదని, దీనిపై క్రికెట్ అడ్వైజరీ కమిటీ తుది నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నాడు. పాకిస్తాన్ క్రికెట్ బోర్డు తరహాలో వన్డేలు, టీ20 ఇంటర్నేషనల్స్‌కు ఒకరు, టెస్ట్ ఫార్మట్‌కు మరొకరిని హెడ్ కోచ్‌లుగా అపాయింట్ చేయకపోవచ్చని వ్యాఖ్యానించాడు.

# ఆటగాళ్లా ఆటబొమ్మలా.. ఫ్రాంచైజీ ఓనర్ల వ్యవహార శైలిపై సర్వత్రా చర్చ!

'పొగడ్త నలుగురి మధ్యలో చెబితే.. విమర్శ నాలుగు గోడల మధ్య చెప్పాలి' అని అంటారు పెద్దలు. కానీ ఐపీఎల్‌లో రెండేండ్ల క్రితం 'లక్నో సూపర్ జెయింట్స్' ఫ్రాంచైజీని కొన్న ప్రముఖ వ్యాపార దిగ్గజం సంజీవ్ గొయెంకా మాత్రం లక్నో సారథి కేఎల్ రాహుల్‌పై బహిరంగంగానే చిందులు తొక్కాడు. అలాగని రాహుల్ చేయకూడని తప్పేమీ చేయలేదు. బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌లో ఓడిపోయినందుకు గాను గొయెంకాకు చిర్రెత్తుకొచ్చి కోపం నశాలానికి తాకింది. తాను మాట్లాడుతున్నది అంతర్జాతీయ స్థాయిలో భారత క్రికెట్‌కు ప్రాతినిథ్యం వహిస్తున్న స్టార్ క్రికెటర్ అన్న సంగతి కూడా మరిచిపోయి.. ఏదో గల్లీ క్రికెట్ మ్యాచ్‌లో బెట్ ఓడిపోతే ఆటగాళ్లను తిట్టినట్టు రాహుల్ ముఖం మీదే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ 'అసలు ఇలాగేనా ఆడటం' అన్నట్టుగా కస్సుబుస్సుమన్నాడు. మైదానంలో వందలాది కెమెరాలు, వేలాది మంది జనం ఉన్నారనే విషయం మరిచి తమ జట్టును రెండు సార్లు ప్లేఆఫ్స్ చేర్చి, నిర్జీవమైన లక్నో పిచ్‌పై అనుభవరాహిత్యమున్న బౌలర్లతోనే అద్భుతాలు చేసిన కెప్టెన్‌ను అందరిముందూ దోషిలా నిలదీశాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యాక ఆటగాళ్లతో ఫ్రాంచైజీ ఓనర్ల వ్యవహార శైలి మరోసారి చర్చనీయాంశమైంది.

## ఇదేం కొత్త కాదు!

ఐపీఎల్‌లో ఓనర్లు ఆటగాళ్లతో ఇలా దురుసుగా ప్రవర్తించడం ఇదే కొత్తకాదు. 2016లో చెన్నైపై నిషేధం ఉన్నప్పుడు రైజింగ్ పూణె సూపర్‌జెయింట్స్‌ను కొనుగోలు చేసిన గొయెంక.. ఆ జట్టుకు సారథిగా వ్యవహరించిన దిగ్గజ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీపైనా ఇదే తీరుగా వ్యవహరించాడని అప్పట్లో పుకార్లు షికార్లు చేశాయి. ఆ సీజన్ తర్వాత ధోనీని కెప్టెన్‌గా తప్పించి స్టీవ్ స్మిత్‌ను నాయకుడిగా నియమించడం వివాదాస్పదమైంది. ఈ సందర్భంగా సంజీవ్ సోదరుడు హర్ష్ గొయెంక ధోనీని కించపరుస్తూ చేసిన ట్వీట్‌పై అప్పట్లో భారత క్రికెట్ అభిమానులు మండిపడ్డారు. గొయెంక బ్రదర్స్‌తో పాటు ఆటగాళ్లతో సన్‌రైజర్స్ హైదరాబాద్ యజమాని కావ్య మారన్ వ్యవహార శైలి కూడా చర్చనీయాంశమే. తమ జట్టుకు తొలి ట్రోఫీ అందించిన డేవిడ్ వార్నర్‌ను 2021 మిడ్ సీజన్‌లో అన్యాయంగా కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించడం, కేన్ విలియమ్సన్, ఎయిడెన్ మార్క్రమ్‌నూ ఇలాగే వాడుకుని వదిలేయడం విమర్శలకు తావిచ్చింది. 2022 సీజన్‌లో



చెన్నై ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా.. సీఎస్‌కే యజమానుల ఒత్తిడి తట్టుకోక 'నా వల్ల కాదు మహాప్రభో' అని సీజన్ మధ్యలోనే ధోనీ ఇచ్చిన కెప్టెన్సీ కాడి వదిలేశాడు. ముంబైకి ఐదు ట్రోఫీలు అందించిన రోహిత్ శర్మపై అంబానీల తీరూ విమర్శలమయమే అయింది. ఇటీవల సంజూ శాంసన్ ఔట్‌పై థర్డ్ అంపైర్ టీవీ రిట్కప్లెలు చూస్తుండగానే స్టేడియం లాబీలో మ్యాచ్ చూస్తున్న క్యాపిటల్స్ యజమాని పార్థ్ జిందాల్.. 'నువ్వు ఔట్.. ఔట్..' అంటూ అరవడమూ వివాదాస్పదమైంది.

## కార్పొరేట్ మయం

ఐపీఎల్‌లో ప్రస్తుతమున్న పది జట్ల యజమానులు కోటాను కోట్ల వ్యాపార సామ్రాజ్యాలకు అధిపతులే. 'యువ ఆటగాళ్లను ప్రోత్సహించడం, ప్రేక్షకులకు క్రికెట్ వినోదాన్ని అందించడం' అనే ఐపీఎల్ ప్రాథమిక సూత్రాలను పక్కనబెడితే ఓనర్లు ఈ ఆటను పూర్తి వ్యాపార దృష్టితోనే చూస్తున్నారనేది జగమెరిగిన సత్యం. బీసీసీఐ కూడా 'డబ్బు ప్రధానం'గానే ఈ టోర్నీని నిర్వహిస్తుందనేది ఎప్పట్నుంచో ఉన్న విమర్శ. దీంతో ఫ్రాంచైజీ ఓనర్లకు ఆడిందే ఆట పాడిందే పాటగా తయారైంది పరిస్థితి. లీగ్‌ను శాసించే స్థాయికి చేరిన ఈ సామ్రాజ్యాధిపతులు.. ఆటగాళ్లు విఫలమైతే వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలకు దిగుతున్నారు. వ్యాపారాల్లో పోటీతో పాటు ఐపీఎల్‌లో ట్రోఫీ గెలవడమన్నది ఫ్రాంచైజీల 'పెట్టుబడి'దారులకు ఓ ప్రతిష్టగా మారింది. ఆటలో గెలుపోటములు సహజమన్న విషయాన్ని గాలికొదిలి 'గెలవకుంటే గెంటివేతే' అన్నట్టుగా వ్యవహరిస్తూ ఆటగాళ్లను ఫ్రాంచైజీలు తమ బానిసలుగా చేసుకుంటున్నాయని అభిమానులు వాపోతున్నారు.

# IPL మధ్యలోనే దుబాయ్‌కు కమిన్స్.. SRH కెప్టెన్ మాస్టర్ ప్లాన్!

ఐపీఎల్-2024ఫస్టాఫ్ లో వరుస విజయాలతో ప్రత్యర్థులను భయపెట్టింది సన్ రైజర్స్ హైదరాబాద్. అయితే సెకండాఫ్ లో మాత్రం అదే జోరును కంటిన్యూ చేయలేకపోయింది. బౌలర్లు ఫర్వాలేదనిపించినా బ్యాటర్లు తడబడటం టీమ్ ను ఇబ్బంది పెట్టింది. పోయిన మూమెంటమ్ ను తిరిగి అందుకునేందుకు చాలా సమయం పట్టింది. మొత్తానికి కమ్ బ్యాక్ ఇచ్చిన ఆరెంజ్ ఆర్మీ గత మూడు మ్యాచుల్లో రెండు విజయాలతో ప్లేఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. ఇప్పటిదాకా ఆడిన 12 మ్యాచుల్లో ఏడింట్లో నెగ్గిన ఎస్ ఆర్ హెచ్.. 14 పాయింట్లతో థర్డ్ పొజిషన్ లో ఉంది. తదుపరి ఆడే రెండు మ్యాచుల్లో ఒకదాంట్లో గెలిస్తే ప్లేఆఫ్స్ కు చేరుతుంది. ఈ తరుణంలో లీగ్ మధ్యలో నుంచి దుబాయ్ కు వెళ్లిపోయాడు కమిన్స్. సన్ రైజర్స్ సారథి కమిన్స్ ఐపీఎల్ మధ్యలో నుంచి దుబాయ్ కు పయనమయ్యాడు. కమిన్స్ మాత్రమే కాదు.. హెన్రిచ్ క్లాసెన్ సహా పలువురు ఇతర ఆటగాళ్లు కూడా ఇతర ప్రాంతాలకు వెళ్లారు. అయితే ఇలా వెళ్లడం వెనుక కమిన్స్ మాస్టర్ ప్లాన్ ఉంది. గత కొన్ని వారాలుగా అలుపెరుగని క్రికెట్ తో ఆరెంజ్ ఆర్మీ ఆటగాళ్లు బాగా అలసిపోయారు. ఐపీఎల్ ప్లేఆఫ్స్ కు సమయం దగ్గర పడుతోంది. ఇంకొన్ని రోజుల్లో ప్లేఆఫ్స్ సమరం మొదలుకానుంది. దీనికి ముందు ప్లేయర్లు ఫ్రెష్ గా ఉండాలి. ఎస్ ఆర్ హెచ్ ప్లేఆఫ్స్ బెర్త్ దాదాపుగా కన్ఫర్మ్ అయినట్లే. నెక్స్ట్ ఆడే రెండు మ్యాచుల్లో ఒకదాంట్లో నెగ్గినా సరిపోతుంది. ఒకవేళ రెండింట్లోనూ ఓడినా నెట్ రన్ రేట్ అద్భుతంగా ఉంది. కాబట్టి




క్వాలిఫై అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్లేఆఫ్స్ ముందు ప్లేయర్లు మరింత తాజాగా, ఉత్సాహంగా, జోష్ తో ఉండాలనే ఉద్దేశంతో రెస్ట్ ఇవ్వాలనే నిర్ణయాన్ని సన్ రైజర్స్ మేనేజ్ మెంట్ తీసుకుందని తెలుస్తోంది. కెప్టెన్ కమిన్స్ సూచన మేరకే ఈ డిసిషన్ తీసుకున్నారని వినిపిస్తోంది. వెకేషన్ లో విశ్రాంతి తీసుకుంటూ, కుటుంబాలతో సమయాన్ని గడుపుతూ ఆటగాళ్లు సేదతీరి మళ్లీ ఫ్రెష్ గా లీగ్ లోకి అడుగుపెట్టాలనేదే మేనేజ్ మెంట్ ప్లాన్ అని సమాచారం. సన్ రైజర్స్ తర్వాతి మ్యాచ్ మే 16వ తేదీన ఉంది. కాబట్టి ఈ టైమ్ ను విశ్రాంతి తీసుకునేందుకు కేటాయించారని తెలిసింది. మరి.. కమిన్స్, ఎస్ ఆర్ హెచ్ మేనేజ్ మెంట్ వేసిన ప్లాన్ పై మీ ఒపీనియన్ ను కామెంట్ల రూపంలో తెలియజేయండి.

# లక్నోకు రాహుల్ గుడ్ బై చెప్పనున్నాడా..?

లక్నో: లక్నోకు సారథి రాహుల్ గుడ్ బై చెప్పనున్నట్టు తెలుస్తోంది. సంజీవ్ గొయెంకతో చాట్ అనంతరం రాహుల్ మనసు నొచ్చుకున్నాడని, ఈ సీజన్‌లో లక్నో ఆడబోయే మిగిలిన రెండు మ్యాచ్‌లకూ అతడు కెప్టెన్‌గా ఉండటం కష్టమేనని జట్టు అంతర్గత వర్గాలు చెబుతున్నాయి.

వచ్చే సీజన్‌లో లక్నో.. రాహుల్‌ను రిటైన్ కూడా చేసుకోదన్న వార్తలూ వినిపిస్తున్నాయి. 2022 సీజన్‌లో లక్నో.. రాహుల్‌ను రూ.17 కోట్లతో దక్కించుకుంది.



# వరుసగా నాలుగో విజయంతో కదం తొక్కిన ఆర్సీబీ.. ప్లేఆఫ్స్ రేసు నుంచి పంజాబ్ ఔట్

## బెంగళూరు జోరు

## విరాట్ కోహ్లీ సెంచరీ మిస్

ఐపీఎల్ ప్లేఆఫ్స్ రేసులోనే ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) వరుసగా నాలుగో విజయంతో కదం తొక్కింది.

ధర్మశాల వేదికగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటింగ్ మ్యాస్ట్రో విరాట్ కోహ్లీ క్లాస్ ఇన్నింగ్స్‌కు తోడు రజత్ పాటిదార్, కామెరూన్ గ్రీన్ మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన బెంగళూరు పంజాబ్ ఎదుట భారీ లక్ష్యాన్ని నిలిపింది. అనంతరం బంతితో పంజాబ్‌ను కట్టడిచేసి ఘనవిజయం సాధించింది. ఈ ఓటమితో పంజాబ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి తప్పుకున్న రెండో టీమ్‌గా నిలిచింది.

%=జదీ% ఎ ధర్మశాల: ఆరంభంలో వరుస పరాజయాలతో నిరాశపరిచినా ఐపీఎల్ -17 రెండో దశ నుంచి జూలు విదిల్చిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు.. ధర్మశాలలో పంజాబ్ కింగ్స్‌ను ఓడించి వరుసగా నాలుగో విజయం సాధించింది. బెంగళూరు నిర్దేశించిన 242 పరుగుల ఛేదనలో పంజాబ్.. 181 పరుగులకే చేతులెత్తేయడంతో 60 పరుగుల తేడాతో ఆర్సీబీ ఘనవిజయం సాధించింది. రన్ మిషీన్ విరాట్ కోహ్లీ (47 బంతుల్లో 92, 7 ఫోర్లు, 6 సిక్సర్లు) తృటిలో శతకం చేజార్చుకోగా రజత్ పాటిదార్ (23 బంతుల్లో 55, 3 ఫోర్లు, 6 సిక్సర్లు) మెరుపులతో మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. భారీ ఛేదనలో పంజాబ్.. 17 ఓవర్లలో 181 పరుగులే చేయగలిగింది. రిలీ రూసో (27 బంతుల్లో 61, 9 ఫోర్లు, 3 సిక్సర్లు), శశాంక్ సింగ్ (19 బంతుల్లో 37, 4 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. కోహ్లీకి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

## కోహ్లీ, పాటిదార్ మెరుపులు

మ్యాచ్ ఆరంభంలోనే 3, 10 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌లను పంజాబ్ ఫీల్డర్లు నేలపాలు చేయడంతో వచ్చిన అవకాశాన్ని అతడు సద్వినియోగం చేసుకున్నాడు. డుప్లెసిస్ (9), జాక్స్ (12) నిరాశపరిచినా పాటిదార్‌తో కలిసి ఆర్సీబీ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. హర్షల్ పటేల్ 6వ ఓవర్లో 3 ఫోర్లు బాదిన పాటిదార్.. రాహుల్ చాహర్ 8వ ఓవర్లో 3 సిక్సర్లతో రెచ్చిపోయాడు. పాటిదార్ ఇచ్చిన రెండు క్యాచ్‌లనూ పంజాబ్ ఫీల్డర్లు జారవిడవడం ఆర్సీబీకి కలిసొచ్చింది. 21 బంతుల్లోనే అర్ధ శతకం చేసిన అతడిని సామ్ కరన్ ఔట్ చేశాడు. మరో ఎండ్‌లో కోహ్లీ.. లివింగ్‌స్టొన్ 13వ ఓవర్లో ఫోర్ కొట్టి హాఫ్ సెంచరీ పూర్తిచేశాక మరింత జోరు పెంచాడు. కరన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లు అర్షదీప్



18వ ఓవర్లో 4,6తో 90లలోకి వచ్చిన విరాట్.. అదే ఓవర్లో నాలుగో బంతికి కవర్స్ వద్ద రూసోకు క్యాచ్ ఇచ్చి శతకాన్ని మిస్ చేసుకున్నాడు. ఆఖర్లో కామెరున్ గ్రీన్ (27 బంతుల్లో 46, 5 ఫోర్లు, సిక్స్), దినేశ్ కార్తీక్ (18) మెరుపులతో ఆ జట్టు భారీ స్కోరు సాధించింది.

## ఆ ఇద్దరు తప్ప..

కొండంత లక్ష్యాన్ని ఛేదించడానికి క్రీజులోకి వచ్చిన పంజాబ్ ఇన్నింగ్స్ నాలుగో బంతికే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయింది. వన్‌డౌన్‌గా వచ్చిన రూసో.. బెయిర్ స్టో(27)కు జతకలిసి దూకుడుగా ఆడాడు. 16 బంతుల్లో 4 ఫోర్లు, ఓ సిక్సర్‌తో ఊపు మీద కనిపించిన బెయిర్ స్టోను ఫెర్గూసన్ ఔట్ చేశాడు. ఎదుర్కొన్న తొలి బంతి నుంచే బౌండరీలతో విరుచుకుపడ్డ రూసో.. సిరాజ్ 4వ ఓవర్లో 3 ఫోర్లు, ఓ సిక్స్‌తో జోరు పెంచాడు. కానీ ఫెర్గూసన్ ఆరో ఓవర్లో బెయిర్ స్టోను ఔట్ చేశాడు. అతడి స్థానంలో వచ్చిన శశాంక్ సింగ్ కొంతసేపు పోరాడాడు. 20 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తిచేసుకున్న రూసోను కర్ణ్ శర్మ బోల్తా కొట్టించడంతో పంజాబ్ తడబడింది. శశాంక్‌ను కోహ్లీ రనౌట్‌తో వెనక్కి పంపగా జితేశ్ (5), లివింగ్‌స్టొన్ (0), అశుతోష్ (8), కరన్ (22) విఫలమయ్యారు. లోయార్డర్ బ్యాటర్లను సిరాజ్ (3/43) ఔట్ చేయడంతో ఆర్సీబీకి భారీ విజయం సాధ్యమైంది. స్వప్నిల్‌సింగ్, ఫెర్గుసన్, కర్ణ్‌శర్మ రెండేసి వికెట్లు తీశారు.

## సంక్షిప్త స్కోర్లు

బెంగళూరు: 20 ఓవర్లలో 241/7 (కోహ్లీ 92, పాటిదార్ 55, హర్షల్ 3/38, విద్వత్ 2/36). పంజాబ్: 17 ఓవర్లలో 181 (రూసో 61, శశాంక్ 37, సిరాజ్ 3/43, స్వప్నీల్ 2/28)

2.. 90లలో ఔట్ అవడం ఐపీఎల్‌లో కోహ్లీకి ఇది రెండోసారి. 2013 సీజన్‌లో ఢిల్లీపై 99 పరుగుల వద్ద ఔట్ అయ్యాడు.

# హార్ధిక్ పాండ్యాకు తేల్చిచెప్పేసిన BCCI.. అలా అయితేనే టీమ్‌లో ఉంటాడు!

టీమిండియాలో గత కొంతకాలంగా గందరగోళ పరిస్థితులు ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ లాంటి యంగ్ ప్లేయర్లు బీసీసీఐ ఆగ్రహానికి గురై సెంట్రల్ కాంట్రాక్ట్ ను కోల్పోయిన విషయం మనందరికి తెలిసిందే. దీంతో బీసీసీఐ రాబోయే రోజుల్లో ప్లేయర్లు ఇలాంటి ఇబ్బందులకు గురిచేయకుండా కొన్ని నిబంధనలను తీసుకురాబోతున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే కొందరు స్టార్ ప్లేయర్లకు వార్నింగ్ సైతం ఇచ్చినట్లు సమాచారం. అందులో హార్దిక్ పాండ్యా కూడా ఉన్నాడట. టీమిండియా స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యాకు బీసీసీఐ వార్నింగ్ ఇచ్చినట్లు తెలుస్తోంది. దాంతో అతడు దారిలోకి వచ్చినట్లు సమాచారం. అసలు విషయం ఏంటంటే? ఈ ఐపీఎల్ సీజన్ కు ముందు టీమిండియాలోని కొంత మంది ఆటగాళ్లు వివిధ కారణాలు చెప్పి డొమెస్టిక్ క్రికెట్ ఆడటం నుంచి తప్పించుకున్నారు. పాండ్యా గాయం అని చెప్పి ఐపీఎల్ సన్నాహకాల్లలో పాల్గొన్న విషయం మనకు తెలియనిది కాదు. అతడితో పాటుగా సోదరుడు కృనాల్ పాండ్యా కూడా ప్రాక్టీస్ లో పాల్గొన్నాడు. ఇక



ఇషాన్ కిషన్, శ్రేయస్ అయ్యర్ ల పరిస్థితి కూడా ఇదే. దాంతో వీరు బీసీసీఐ ఆగ్రహానికి గురైయ్యారు. ఇషాన్, అయ్యర్ లను సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించింది. ఈ షాకింగ్ డెసిషన్ తో వారు ఆ తర్వాత డీవై పాటిల్ టీ20 కప్ లో ఆడారు. ఇదిలా ఉండగా.. అప్పుడు గాయం కారణంగా డొమెస్టిక్ క్రికెట్ కు దూరంగా ఉన్న పాండ్యాపై కూడా బీసీసీఐ గుర్రుగానే ఉంది. తాజాగా జరిగిన మీటింగ్ లో పాండ్యాకు తేల్చి చెప్పారట బీసీసీఐ పెద్దలు. డొమెస్టిక్ క్రికెట్ కచ్చితంగా ఆడాలని పాండ్యాకు సూచించిందట బీసీసీఐ. లేదంటే టీమ్ లో ప్లేస్ కష్టమే అంటూ ఇన్ డైరెక్ట్ వార్నింగ్ సైతం ఇచ్చిందట. ఇక దానికి హార్దిక్ సైతం సరే అంటూ బీసీసీఐకి కండిషన్ కు ఓకే చెప్పాడట. ఇదిలా ఉండగా.. బీసీసీఐ ప్రధాన కార్యదర్శి కీలక వ్యాఖ్యలు చేశాడు. టీమిండియాకు త్వరలోనే కొత్త కోచ్ కోసం ప్రకటన విడుదల చేస్తామని, దానికి రాహుల్ ద్రవిడ్ కూడా అప్లై చేసుకోవచ్చని సూచించాడు. అయితే అతడు ఇండియన్ హా? లేక విదేశీయుడా? ఇప్పుడే చెప్పలేమని పేర్కొన్నాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**